ప్రజా పరిషత్

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు



శ్రీవారి సర్వదర్శనం జెట్ స్పీడ్..
క్యూలైన్లలోకి నేరుగా ప్రవేశం

ప్రచురణ : జగిత్యాల సంపుటి : 07 సంచిక : 63 గురువారం 05 - 11 - 2026 పేజీలు : 04 వెల రూ. 2

సదర్ అంటే తెలంగాణ ఆత్మగౌరవం

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో ఘనంగా సదర్ వేడుకలు జరిగాయి
- సదర్ సమ్మేళనానికి సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు
- సదర్ వేడుకలకు రూ.5 కోట్ల నిధులు కేటాయించామని తెలిపారు
- తెలంగాణలో అన్నీ రాష్ట్రాల ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారని, యాదవులకు సముచిత స్థానం కల్పిస్తున్నామని స్పష్టం



హైదరాబాద్ :

హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియం సదర్ వేడుకలతో సందడిగా మారింది. యాదవుల సంప్రదాయాలు, సంస్కృతి, ఐక్యతను చాటిచెప్పేలా రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో శ్రీకృష్ణ సదర్ సమితి సదర్ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి యాదవులు భారీగా తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన దున్నరాజుల ప్రదర్శనలు, కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, వాకిటి శ్రీహరి, ఎంపీ మల్లు రవి, ఉత్తరప్రదేశ్ ఎంపీ ధర్మేంద్ర యాదవ్, బిహార్ మాజీ ఉపముఖ్యమంత్రి తేజస్వి యాదవ్‌లు హాజరై సదర్ ఉత్సవాల ప్రత్యేకత, సంస్కృతి గొప్పతనం గురించి మాట్లాడారు.రాష్ట్ర ప్రజలందరికి రేవంత్ రెడ్డి సదర్ శుభాకాంక్షలు తెలిపారు. సదర్ సమ్మేళనం తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సదర్‌ను అధికారిక పండుగగా నిర్వహిస్తోందని చెప్పారు. హైదరాబాద్‌లో అన్ని రాష్ట్రాలకు చెందిన ప్రజలు శాంతియుతంగా, సుఖసంతోషాలతో జీవిస్తున్నారన్నారు. సదర్ సంబురాల ద్వారా - మిగతా 2 లో

కండక్టర్ ప్రవళిక కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, ఉద్యోగం



- రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- ప్రయాణికురాలి దాడిలో గాయపడిన మహిళా కండక్టర్ ప్రవళిక మృతి
- మృతురాలి తల్లికి ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని పొన్నం హామీ
- ఉస్మానియా మార్చురీ వద్ద ప్రవళిక మృతదేహానికి నివాళి అర్పించిన మంత్రి

హైదరాబాద్ :

ప్రయాణికురాలి దాడిలో తీవ్రంగా గాయపడి మృతి చెందిన టీజీఎస్ఆర్టీసీ మహిళా కండక్టర్ గుండ్ల ప్రవళిక (24) కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ మేరకు హామీ ఇచ్చారు. ప్రభుత్వం, ఆర్టీసీ తరపున కలిపి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా,ప్రవళిక - మిగతా 2 లో



పోలవరం-బనకచర్ల లింక్‌పై రేవంత్ సర్కార్ ద్వంద్వ వైఖరి

- తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత
- నదీ జలాల వినియోగంపై ప్రభుత్వానికి స్పష్టమైన విధానం లేదని విమర్శ
- పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుతో తెలంగాణకు జరిగే నష్టాన్ని గుర్తించాలని సూచన

హైదరాబాద్ :

పోలవరం – బనకచర్ల లింక్ ప్రాజెక్టు విషయంలో తెలంగాణ ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల - మిగతా 2 లో



మియాపూర్ భూములు అమ్మొద్దు, పేదలకు పంచివ్వండి

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- మియాపూర్ 550 ఎకరాల భూమిని అమ్మవద్దన్న కేటీఆర్
- పేదలు, అమరవీరులు, ఉద్యమకారులకు కేటాయించాలని డిమాండ్
- ఏడాదిలో కేసీఆర్ తిరిగి అధికారంలోకి వస్తారని ధీమా

2 లో..



ఇరాన్‌పై అణుదాడి జరిగితే భారత్‌కూ ముప్పు తప్పదా

- ఇరాన్‌లోని పిక్‌యాక్స్ పర్వతంపై అమెరికా గురి
- పాక్ మీదుగా భారత్‌కు రేడియేషన్ చేరే అవకాశం
- పంజాబ్, రాజస్థాన్, గుజరాత్‌కు ముప్పు ఉండొచ్చని అంచనా

2 లో..



అగ్నివీరులకు మరో రెండేళ్లు సర్వీసు పొడిగింపు

- కేంద్రం కీలక నిర్ణయం
- నాలుగేళ్ల తర్వాత బయటకు వెళ్లాల్సిన 75 శాతం మందికి వెసులుబాటు
- పొడిగింపు తర్వాతా శాశ్వత సర్వీసుకు అవకాశం
- ప్రతిభ ఆధారంగా శాశ్వత నియామకాలు
- రాత పరీక్ష తర్వాతే శారీరక పరీక్ష.. నైపుణ్య ప్రదర్శనలు
- తొలి బ్యాచ్ సర్వీసు గడువు డిసెంబరులో ముగింపు

ఢిల్లీ :

అగ్నిపథ్ పథకం కింద సైన్యంలో చేరిన అగ్నివీరులకు కేంద్ర ప్రభుత్వం కీలక వెసులుబాటు కల్పించింది. ఇప్పటికే ఉన్న నాలుగేళ్ల సర్వీసుకు అదనంగా మరో రెండేళ్లు పొడిగించాలని నిర్ణయించింది. తొలి బ్యాచ్ అగ్నివీరుల పదవీకాలం ముగియనున్న తరుణంలో ఈ - మిగతా 2 లో

భూమి వైపు దూసుకొస్తున్న నాసా స్పేస్ టెలిస్కోప్ శకలాలు

- భారత్‌లోనూ శకలాలు పడే అవకాశం!
- భూవాతావరణంలోకి తిరిగి ప్రవేశించనున్న నాసా స్విఫ్ట్ టెలిస్కోప్
- 2004లో ప్రయోగించిన అబ్జర్వేటరీకి 22 ఏళ్ల చరిత్ర
- 2,000కు పైగా గామా కిరణాల విస్ఫోటనాలను గుర్తించిన టెలిస్కోప్
- శకలాలు పడే పరిధిలో దక్షిణ భారతదేశంలోని కొన్ని ప్రాంతాలు
- చాలా భాగం వాతావరణంలోనే కాలిపోతుందని అంచనా



ఢిల్లీ :

దాదాపు 22 ఏళ్లుగా అంతరిక్ష రహస్యాలను ఛేదించిన నాసా స్పేస్ టెలిస్కోప్ 'నీల్ గెహ్రెల్స్ స్విఫ్ట్ అబ్జర్వేటరీ' భూమి వాతావరణంలోకి తిరిగి ప్రవేశించేందుకు సిద్ధమైంది. దాని కక్ష్యను పెంచి మరికొంతకాలం సేవలు అందించేలా చేసేందుకు చేపట్టిన ప్రయత్నం విఫలమవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. టెలిస్కోప్‌లోని అధిక భాగం వాతావరణంలోకి ప్రవేశించే సమయంలోనే కాలిపోతుందని అంచనా వేస్తున్నారు. అయితే, కొన్ని భాగాలు మాత్రం శకలాల రూపంలో భూమిని - మిగతా 2 లో




23న ఏపీలో మేయర్, ఛైర్‌పర్సన్‌ల ప్రమాణ స్వీకారం

- అధికారికంగా తేదీని ఖరారు చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం
- 13 కార్పొరేషన్లు, 77 మున్సిపాలిటీలకు కొత్త పాలకవర్గాలు
- డిప్యూటీ మేయర్లు, వైస్ ఛైర్‌పర్సన్ల ఎన్నికపై ఇంకా స్పష్టత రాని వైనం
- ప్రత్యక్ష ఎన్నికల నేపథ్యంలో కొత్త నిబంధనలు జారీ చేయనున్న ఎస్ఈసీ

2 లో..

నేడే ఆంధ్రప్రదేశ్ ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు



- రాష్ట్ర ఎన్నికల సంఘం గ్రీన్ సిగ్నల్
- షెడ్యూల్ ప్రకారమే పరిషత్ ఎన్నికల పోలింగ్
- కలెక్టర్లతో సమీక్ష అనంతరం స్పష్టతనిచ్చిన ఎస్ఈసీ
- చాలా జిల్లాల్లో వర్షాలు తగ్గాయని మెజారిటీ అధికారుల నివేదిక

అమరావతి :

ఆంధ్రప్రదేశ్‌లో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం నేడు పోలింగ్ యథావిధిగా జరుగుతుందని రాష్ట్ర - మిగతా 2 లో

సీఎం చంద్రబాబుకు ప్రధాని మోదీ ఫోన్


- తుపాన్ల నష్టంపై ఆరా
- వరుస తుపాన్ల నేపథ్యంలో సీఎం చంద్రబాబుకు ఫోన్ చేసిన ప్రధాని మోదీ
- రాష్ట్రానికి జరిగిన నష్టం, రైతుల ఇబ్బందులను ప్రధానికి వివరించిన ముఖ్యమంత్రి

అమరావతి :

వరుస తుపాన్లతో నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు అండగా నిలుస్తామని కేంద్రం భరోసా ఇచ్చింది. వారం రోజుల వ్యవధిలో 'అర్నబ్', 'మురసు' తుపాన్లు రాష్ట్రాన్ని అతలాకుతలం చేసిన నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ - మిగతా 2 లో

తుపాన్లతో నష్టపోయిన రాష్ట్రానికి తక్షణ సాయం అందించండి

- కేంద్రంతో సీఎం చంద్రబాబు
- అర్నబ్, మురసు తుపాన్లతో రాష్ట్రానికి భారీ నష్టం
- రెండు తుపాన్ల నష్టంపై కేంద్రానికి వేర్వేరుగా లేఖలు
- అర్నబ్ తుపానుతో రూ.4,563 కోట్ల నష్టం, మురసు తుపాను ప్రభావంతో రూ.343 కోట్ల ఆస్తి నష్టం
- 16 జిల్లాల్లో 3 లక్షల హెక్టార్లలో వ్యవసాయ పంటలు దెబ్బతీత
- కొలంబో పోర్టులో నిలిచిన 150కి పైగా మిర్చి కంటెయినర్లు
- మిర్చి ఎగుమతులకు అడ్డంకులు తొలగించాలని కేంద్రానికి విజ్ఞప్తి



అమరావతి :

అర్నబ్, మురసు తుపాన్లతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు సీఎం చంద్రబాబు కేంద్రంపై ఒత్తిడి పెంచుతున్నారు. రైతులకు తక్షణ సాయం అందించడంతో పాటు దెబ్బతిన్న పంటలకు పరిహారం వచ్చేలా కేంద్ర మంత్రులతో సంప్రదింపులు జరుపుతున్నారు. రైతుల కష్టాలు, నష్టాలపై కేంద్రానికి వరుసగా లేఖలు రాయడంతో పాటు కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో ఇప్పటికే నాలుగుసార్లు మాట్లాడి కేంద్ర బృందాలను రాష్ట్రానికి రప్పించారు. అర్నబ్ తుపాన్‌తో రాష్ట్రానికి రూ.4,563 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక నివేదిక పంపిన ప్రభుత్వం 781 గ్రామాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయని వెల్లడించింది.16 జిల్లాల్లో 3 లక్షల హెక్టార్ల వ్యవసాయ పంటలు, 13.6 వేల హెక్టార్ల ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని, 29 వేల విద్యుత్ స్తంభాలు, 7,981 కిలోమీటర్ల విద్యుత్ లైన్లు ధ్వంసమయ్యాయని నివేదికలో పేర్కొంది. తక్షణ ఉపశమనం కోసం రూ.4,563 కోట్లు మంజూరు చేయాలని సీఎం కేంద్రాన్ని కోరారు. మురసు తుపాన్ కారణంగా ఏడు జిల్లాల్లో 465 గ్రామాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయని మరో లేఖలో వివరించారు. 50,473 హెక్టార్లలో వరి పంట, 1,985 హెక్టార్లలో వాణిజ్య పంటలు దెబ్బతిన్నాయని, - మిగతా 2 లో

సంపాదకీయం

స్త్రీగాత్రం, పురుష పాకం

ఈ పాటను 1984లో నా మిత్రుడు పాడుతుండగా విని 'బాగుందే' అనుకునేవాడిని. 1970 ప్రాంతంలోనే 'మందులోడా ఓరి మాయలోడా! మామ రారా గోపి చిన్నవాడా' అంటూ జనాలు పాడుకునేవారు. దానిని 'మందలోడా, ఓరి మాయలోడా' అని కూడా పాడడం విన్నాను. 'మందలోడ అయితేనేం, మందులోడ అయితేనేం.. బాణీ అదే! ఆ రోజుల్లో బుడబుక్కల పాట (జముకుల పాట, బోనెల పాట), నక్కజంగాల పాట, సన్యాసమ్మ పాట, సితార పట్టుకుని సాతాని వైష్ణవులు పాడే పాటలు, తత్వాలు, హరికథలు, బుర్రకథలు, తూర్పు భాగవతం ఇలా నేను పుట్టి పెరిగిన కళింగాంధ్ర పల్లె రేయింబవళ్లు కిలకిలారావాల తోటలా ఉండేది. ఎక్కడెక్కడి నుంచో వచ్చిన నక్కలోళ్లు, ఈటీవాళ్లు, గారడీ వాళ్లు, గంగిరెద్దులోళ్లు, గంటసాయిబులు, కొమ్మదాసరులు, కోయదొరలు, మందలోళ్లు, మల్లికార్జునులు తదితర జానపదులతో పల్లె కళకళలాడేది. వారికి వేసిన పిడికెడు బియ్యమే జానపద కళాప్రస్థానానికి ఇంధనం. గౌరీ పౌర్ణిమ వస్తే, గౌరీ కల్యాణ ఉత్సవాలలో భాగంగా పులి వేషాలు, పగటి వేషాలతో, రాత్రిపూట కళాప్రదర్శనలతో కళింగాంధ్ర గ్రామాలు ఆనందభరితంగా సాగిపోయేవి. ఇలాంటి సందడి మధ్యనే పుట్టిన రెడ్డి విజయలక్ష్మి (రెడ్డోలి బొట్టి?) తన పరిస్థితులు కల్పించిన కష్టజీవితాన్ని సహజాతమైన గానంతో మైమరపిస్తూ, లక్షలాది ప్రేక్షకులను ఉర్రూతలూగించడం ప్రారంభించింది. ఈ నేలలో అక్కడక్కడా ఖండఖండాలుగా పాడుకుంటున్న పాటల్ని సేకరించి, తన గానంతో వాటికి ప్రాణం పోసి, వేదికల మీద నాట్యం చేయించింది. సొంతంగా పాటలు రాసి, బాణీలు కట్టుకొని, పాడి జానపదులను ఆనందసంద్రంలో ఓలలాడించింది. పగలంతా చెమటోడ్చి శ్రమించిన కర్షకులు, రైతుకూలీలు ఈమె ప్రదర్శనకు ఈలలు, చప్పట్లు, వన్స్ మోర్లతో నీరాజనం పట్టేవారు. వజ్రాలను వెలికితీసి సానబెట్టగల నిపుణి గరివిడి లక్ష్మి. ఆమె సేకరించి సజీవంగా నిలిపిన జానపద గేయాల కంటే, ఇంకా మిగిలిపోయిన ఉలాల పాటలు, ఉయ్యాల పాటలు, దంపుడు పాటలు వేలాదిగా ఉన్నాయి. శ్రామిక జనం ఉన్నన్నాళ్లూ మా నేలలో పాటలు ప్రవహిస్తూనే ఉంటాయి. ఈ యమ్మి గొంతెత్తి పాడితే అప్పటికే పద్యనాటక రంగంలో బాలగంధర్వుడిగా బిరుదు పొంది, గానంలో శిఖరాయమానుడైన షణ్ముఖి ఆంజనేయరాజు పద్యాలాపన దిగదుడుపై పోయేది. ఇకపై 'పద్యానికి విరామం, పాటకు పట్టాభిషేకం' అంటూ రాజుగారు ఆమెను ఆశీర్వదించారంటేనే ఆమె గాత్ర స్థాయి ఎంతో ఊహించవచ్చు. 'స్త్రీగాత్రం, పురుష పాకం' అని పెద్దలు ఊరకనే చెప్పలేదు. గాత్రంతో పాటు వేదికపై ఈమె చేస్తున్న నాట్య చాలనం, ఆయా విద్యలలో 'మేమే ఉన్నతులం' అనుకుంటున్న కళాకారులకు కూడా అందని విద్య. 'నేనే తెల్లవార్లూ పాడి, ఆడేదాన్ని' అని ఆమె చెప్పుకోవటంలో స్వోత్కర్ష ఇసుమంతైనా లేదు. అప్పటి ఈమె బుర్రకథల వీడియోలే సాక్ష్యాలు. అందుచేతనే షావుకారు జానకిలా, రెడ్డి విజయలక్ష్మి 'గరివిడి లక్ష్మి' అయింది. కళింగాంధ్రులు పాటకు చెవి కోసుకునే రకం. డి.వి సుబ్బారావును కూడా అందుకే ఆరాధించేవారు. ఇలా ప్రారంభమైన ప్రవాహం కళింగాంధ్రను ముంచి, ఆంధ్ర అంతటా వ్యాపించి, బరంపురం వరకూ సాగింది. ఇంత ఉధృతంగా సాగుతున్న జానపదకళ మీద పండితుల పెదవి విరుపులు ఎదురుదాడి చేస్తూనే ఉండేవి. 'మకరధ్వజుని కొంప ఒక చెంప కనిపింప, చీరగట్టిన దయా చిగురుబోడి' అంటూ పద్యాలు చదువుకొని ఆనందించే, కళింగాంధ్ర పండితులూ, శిష్టులూ గరివిడి లక్ష్మివి బూతు పాటలనేవారు. బూతే ప్రకృతికి మూలమని తెలిసి కూడా! వామపక్షవాదులు, అభ్యుదయవాదులూ తక్కువేం తినలేదు. ఆమెకు వర్గ చైతన్యం లేదని వదిలేశారు. ఈమె చేయిపట్టి వర్గచైతన్యం కలిగించి ఉంటే ఆమె కథను ఇంకోలా రాసుకొనేవాళ్లం. వంగపండుకు ముందో వెనకో ఇంకా పాడుతూనే ఉండేది. నాజర్ బుర్రకథను సినిమాల్లో పెట్టినట్టే సందర్భానుసారంగా ఈమె బుర్రకథనూ పెట్టి ఉంటే ఆ సినిమా ఘనంగా ఆడేది, ఈమెకు మరింత కీర్తి దక్కేది. గద్దర్, వంగపండు, గోరటి ఇలా ఎంతోమంది తెలుగునాట పల్లెలో పుట్టి, చదువుకొని, పట్టణాలకు ఎదిగి పెద్ద పెద్ద స్థాయిలను, స్థానాలను అందుకున్నారు. వారికి, వారితో పాటు ఎంతోమంది కళాకారులకు ఎన్నెన్నో బిరుదులు, సన్మానాలు, అవార్డులు, పదవులు అందాయి. చదువులేని ఈ పల్లెటూరి పేదపిల్లకు, ఒంటరి మహిళకు ఎవరు ఇప్పిస్తారు అవార్డులన్నీ? అయినా మహానటి సావిత్రి తర్వాత అంతకుమించిన ఒక బయోపిక్ తాను జీవించి ఉండగానే చూడగలగడం గరివిడి లక్ష్మి పొందిన ఘనత. అందుకు కళింగాంధ్ర గర్విస్తోంది. పేరులోనే కళింగాంధ్ర సంస్కృతిని నింపుకున్నవాడు జమ్ము గౌరినాయుడు. ఇక్కడి సంస్కృతిలో అంతరించిపోతున్న పేరు. మట్టిలో పుట్టి పెరిగిన పేద కళాకారిణి జీవితాన్ని చలన చిత్ర రంగానికి ఎక్కించి, ఇక్కడి యాసను, మాండలికాన్ని చివరంటా కొనసాగించి, కళింగాంధ్ర తత్వాన్ని తెలుగునేలలో రెపరెపలాడించినవాడు. గరివిడి లక్ష్మి బుర్రకథకు అప్పటి యువత ఎలా ఉర్రూతలూగారో, అలాగే నేడు సినిమాహాల్లో యువతీ యువకులు ఉర్రూతలూగుతూ చేసే నృత్యహేల అద్భుత సందర్భం.

తుపాన్లతో నష్టపోయిన రాష్ట్రానికి తక్షణ సాయం అందించండి

మొదటిపేజీ తరువాయి - ప్రాథమికంగా రూ.343 కోట్ల ఆస్తి నష్టం జరిగిందని వెల్లడించారు. రెండు తుపాన్లతో నష్టపోయిన రైతులకు తక్షణ తాత్కాలిక సాయం ప్రకటించాలని కేంద్రాన్ని కోరారు. మరోవైపు శ్రీలంకలోని కొలంబో పోర్టులో నిలిచిపోయిన మిర్చి ఎగుమతులపైనా చంద్రబాబు కేంద్రానికి లేఖ రాశారు. చైనా, బంగ్లాదేశ్, ఇండోనేసియా, థాయ్‌లాండ్, సింగపూర్ తదితర దేశాలకు వెళ్లాల్సిన 150కి పైగా మిర్చి కంటెయినర్లు తేమ శాతం పరిమితి కారణంగా పోర్టులోనే నిలిచిపోయాయని తెలిపారు. సుమారు రూ.60 కోట్ల విలువైన సరకు నిలిచిపోవడంతో రైతులు, ఎగుమతిదారులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ జోక్యం చేసుకుని ఆయా దేశాలతో సంప్రదింపులు జరిపి కంటెయినర్ల ఎగుమతికి మార్గం సుగమం చేయాలని ముఖ్యమంత్రి కోరారు.

నేడే ఏపీ ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు

మొదటిపేజీ తరువాయి - ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ) స్పష్టం చేసింది. ఈ మేరకు ఈరోజు జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఎస్ఈసీ ఈ నిర్ణయాన్ని ప్రకటించింది. 'మురసు' తుపాను కారణంగా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఎన్నికలు వాయిదా పడతాయనే ప్రచారం జరిగింది. పోలింగ్ నిర్వహణకు పరిస్థితులు అనుకూలంగా లేవని కొందరు కలెక్టర్లు కూడా నివేదించడంతో, దీనిపై తుది నిర్ణయం తీసుకునేందుకు ఎస్ఈసీ సమీక్ష చేపట్టింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా... వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో మాట్లాడి క్షేత్రస్థాయి పరిస్థితులపై ఆరా తీశారు. చాలా జిల్లాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టాయని, పోలింగ్ నిర్వహణకు పెద్దగా ఇబ్బందులు లేవని మెజారిటీ కలెక్టర్లు ఎస్ఈసీకి నివేదించారు. ఒకటి రెండు చోట్ల మినహా రాష్ట్రవ్యాప్తంగా పోలింగ్‌కు అనుకూల వాతావరణమే ఉందని నిర్ధారించుకున్న ఎస్ఈసీ... ఎన్నికలను ప్రశాంతంగా, సజావుగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించింది. దీంతో నవంబర్ 5న పోలింగ్, నవంబర్ 7న ఓట్ల లెక్కింపు జరగనుంది.

పోలవరం-బనకచర్ల లింక్‌పై రేవంత్ సర్కార్ ద్వంద్వ వైఖరి

మొదటిపేజీ తరువాయి - కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నదీ జలాల వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టమైన విధానం లేదని, ఈ విషయం ఎన్‌డబ్ల్యూడీఏ సమావేశాలతో మరోసారి బహిర్గతమైందని ఆమె విమర్శించారు. ఎన్‌డబ్ల్యూడీఏ సమావేశాల్లో రాష్ట్ర అధికారులు గోదావరి – కావేరి నదుల అనుసంధానాన్ని సమ్మక్క సాగర్ నుంచి చేపట్టాలని కోరుతుంటే... మరోవైపు కేంద్ర హోంమంత్రి అధ్యక్షతన జరిగిన దక్షిణాది రాష్ట్రాల కౌన్సిల్ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి పోలవరం – బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు సమ్మతి తెలపడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని కవిత ఆరోపించారు. ఈ ప్రాజెక్టు వల్ల తెలంగాణ నీటి హక్కులకు తీవ్ర విఘాతం కలుగుతుందని, 2024లోనే తెలంగాణ జాగృతి తరపున తాము దీనిని వ్యతిరేకించామని గుర్తుచేశారు. "రాష్ట్రానికి హక్కుగా దక్కాల్సిన 250 టీఎంసీల గోదావరి జలాలను సీఎం రేవంత్ రెడ్డి ఏపీ సీఎం చంద్రబాబుకు 'గురుదక్షిణ'గా చెల్లించుకుంటున్నారు" అని ఆమె సంచలన ఆరోపణలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఆమోదంతోనే ఏపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు విషయంలో ముందుకెళ్లేందుకు కేంద్రంపై ఒత్తిడి తెస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని పోలవరం–బనకచర్ల ప్రాజెక్టుతో తెలంగాణకు జరిగే నష్టాన్ని గుర్తించాలని కవిత హెచ్చరించారు. ఈ ప్రాజెక్టుపై కేంద్రం జరిపే అన్ని సంప్రదింపుల నుంచి తెలంగాణ తక్షణమే వైదొలగాలని, ప్రాజెక్టును అడ్డుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రధాని నరేంద్ర మోదీకి సీఎం వెంటనే లేఖ రాయాలని ఆమె డిమాండ్ చేశారు.

మియాపూర్ భూములు అమ్మొద్దు, పేదలకు పంచివ్వండి

మొదటిపేజీ తరువాయి - మియాపూర్‌లోని 550 ఎకరాల ప్రభుత్వ భూమి వస్తే అమ్మేస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంటున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఆ భూములను అమ్మి సొమ్ము చేసుకోవాలని చూడకుండా, పేదలు, అమరవీరులు, ఉద్యమకారులకు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని హైదర్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్ రెడ్డి తన అనుచరులతో కలిసి ఈరోజు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడుతూ... "మియాపూర్‌లోని 550 ఎకరాల్లో 200 ఎకరాలు పేదల ఇళ్లకు, 100 ఎకరాలు అమరవీరులకు, మరో 100 ఎకరాలు ఉద్యమకారులకు కేటాయించండి. మిగిలిన భూమిలో పాఠశాలలు, కాలేజీలు కడితే మనస్ఫూర్తిగా స్వాగతిస్తాం" అని అన్నారు. ప్రజల ఆశీర్వాదంతో ఏడాదిలోపే కేసీఆర్ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం వచ్చాక ఈ భూముల వ్యవహారాలపై దృష్టి సారిస్తామని స్పష్టం చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినట్లు ఉద్యమకారులకు 250 గజాల స్థలం ఇచ్చే చిత్తశుద్ధి ఉందా అని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. ఎక్కడో 80 కిలోమీటర్ల దూరంలోని ఎర్రవెల్లిలో కాకుండా, హైదరాబాద్ నగర నడిబొడ్డున ఉన్న మియాపూర్‌లోనే అమరవీరులకు ఇళ్లు కట్టివ్వాలని సవాల్ విసిరారు. 'హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ' పేరుతో జరుగుతున్న స్కాంలో భాగస్వాములైతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని పారిశ్రామికవేత్తలను ఆయన హెచ్చరించారు.

సీఎం చంద్రబాబుకు ప్రధాని మోదీ ఫోన్



మొదటిపేజీ తరువాయి - ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఫోన్ చేసి తాజా పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తుపాన్ల ప్రభావం, వాటి వల్ల జరిగిన నష్టం గురించి చంద్రబాబు ప్రధానికి వివరించారు. భారీ వర్షాలు, బలమైన గాలుల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. రోడ్లు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాల రంగాల్లోనూ భారీ నష్టం వాటిల్లిందని, రాష్ట్రాన్ని ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం తగిన సహాయం అందించాలని కోరారు. దీనిపై స్పందించిన ప్రధాని మోదీ, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సహాయక చర్యలను ప్రశంసించారు. నిరంతర అప్రమత్తతతో తుపాను సవాళ్లను సమర్థంగా ఎదుర్కొన్నారని చంద్రబాబును అభినందించారు. అంతకుముందు ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు లేఖ రాయడంతో పాటు ఫోన్‌లోనూ మాట్లాడారు. మంగళవారం ఒక్కరోజే రెండుసార్లు అమిత్ షాతో మాట్లాడిన చంద్రబాబు, ఒక తుపాను నుంచి కోలుకోకముందే మరో తుపాను రావడం వల్ల పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారిందని వివరించారు. 'మురసు' తుపాను వల్ల రాష్ట్రంలో ప్రాథమికంగా రూ.343.95 కోట్ల నష్టం వాటిల్లినట్లు అంచనా వేశామని తెలిపారు. ఇందులో సుమారు 94 శాతం నష్టం ఒక్క వ్యవసాయ రంగంలోనే జరిగిందని పేర్కొన్నారు. ఏడు జిల్లాల్లోని 465 గ్రామాల్లో 50,473 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయని, దీనివల్ల 69,828 మంది రైతులు నష్టపోయారని సీఎం వివరించారు. దెబ్బతిన్న పంటల్లో 45,900 హెక్టార్ల వరి పంట ఉందని, ఒక్క వ్యవసాయ రంగంలోనే ప్రాథమిక నష్టం రూ.324.22 కోట్లుగా ఉందని తెలిపారు. ముఖ్యంగా బాపట్ల, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఉద్యాన పంటలతో సహా పంట నష్టం తీవ్రంగా ఉందని పేర్కొన్నారు. తుపాన్ల హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్‌డీఎంఏ), రియల్-టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్‌టీజీఎస్)లను అప్రమత్తం చేశామని చంద్రబాబు తెలిపారు. సహాయక చర్యల కోసం 11 ఎస్‌డీఆర్ఎఫ్, 13 ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచామని, ప్రభావిత జిల్లాల్లో 480 పాఠశాలలను పునరావాస కేంద్రాలుగా మార్చి, 12,230 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించామని కేంద్రానికి వివరించారు.

భూమి వైపు దూసుకొస్తున్న నాసా స్పేస్ టెలిస్కోప్ శకలాలు

మొదటిపేజీ తరువాయి - చేరే అవకాశం ఉంది. 2004లో ప్రయోగించిన ఈ అబ్జర్వేటరీ విశ్వంలో అత్యంత శక్తిమంతమైన పేలుళ్లుగా భావించే గామా కిరణాల విస్ఫోటనాలను అధ్యయనం చేసేందుకు రూపొందించారు. తొలుత రెండేళ్లపాటు పనిచేసేలా దీన్ని రూపొందించినప్పటికీ, రెండు దశాబ్దాలకు పైగా సేవలందించింది. ఈ కాలంలో 2,000కు పైగా గామా కిరణాల విస్ఫోటనాలను గుర్తించి, వాటి సమాచారాన్ని శాస్త్రవేత్తలకు అందించింది. సూపర్‌నోవాలు, బ్లాక్‌హోల్స్, ఇతర ఖగోళ వస్తువుల అధ్యయనంలోనూ కీలక పాత్ర పోషించింది. సూర్యుడిపై పెరిగిన కార్యకలాపాల కారణంగా భూమి ఎగువ వాతావరణం విస్తరించింది. దీంతో కక్ష్యలో ఉన్న స్విఫ్ట్ టెలిస్కోప్‌పై వాతావరణ ఘర్షణ ప్రభావం పెరిగి, అది క్రమంగా కిందికి దిగడం ప్రారంభించింది. దాని కక్ష్యను పెంచేందుకు నాసా 'లింక్' అనే రోబోటిక్ అంతరిక్ష నౌకను పంపించింది. అయితే, ఆ నౌకలో తలెత్తిన నియంత్రణ సమస్యలతో టెలిస్కోప్‌ను పై కక్ష్యకు చేర్చే ప్రయత్నం విఫలమైంది. నాసా, అమెరికా అంతరిక్ష దళం అంచనాల ప్రకారం.. టెలిస్కోప్ భూమి వాతావరణంలోకి తిరిగి ప్రవేశించే సమయం మారే అవకాశం ఉంది. దాని కక్ష్యను బట్టి శకలాలు పడే అవకాశం ఉన్న ప్రాంతం భూమధ్యరేఖకు ఉత్తర, దక్షిణ దిశల్లో 20.6 డిగ్రీల అక్షాంశాల మధ్య ఉంటుంది. ఈ పరిధిలో దక్షిణ భారతదేశంలోని కొన్ని ప్రాంతాలు కూడా ఉన్నాయి. అయితే, ఏ ప్రాంతంలో శకలాలు పడతాయన్నది ముందుగానే కచ్చితంగా చెప్పలేము. నాసా అంచనా ప్రకారం.. భూమిపై ఎవరికైనా హాని కలిగే ప్రమాదం చాలా తక్కువగా ఉంది. ఒకరికి హాని కలిగే అవకాశం సుమారు 2,100 మందిలో ఒకరికి మాత్రమే ఉంటుందని అంచనా వేసింది. శకలాలు సముద్రంలో పడే అవకాశమే ఎక్కువగా ఉందని భావిస్తున్నారు. ఈ ప్రక్రియను నాసా, అమెరికా అంతరిక్ష దళం నిరంతరం పర్యవేక్షిస్తున్నాయి.


అగ్నివీరులకు మరో రెండేళ్లు సర్వీసు పొడిగింపు

మొదటిపేజీ తరువాయి - పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ నిర్ణయం ప్రకారం, నాలుగేళ్ల సేవ తర్వాత సాధారణ విధానంలో శాశ్వత సైనికులుగా ఎంపిక కాని మిగిలిన 75 శాతం అగ్నివీరులకు మరో రెండేళ్లు పనిచేసే అవకాశం లభించనుంది. ఈ పొడిగించిన సేవ పూర్తయ్యాక కూడా ప్రతిభ ఆధారంగా సాధారణ సైనిక విభాగంలో చేరేందుకు అవకాశం కల్పిస్తామని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ ఎన్.ఎస్. రాజా సుబ్రమణి వెల్లడించారు. అగ్నిపథ్ పథకం 2022లో ప్రారంభమైంది. ప్రస్తుతం ఈ పథకం కింద సైన్యం, నౌకాదళం, వాయుసేనల్లో నాలుగేళ్ల కాలానికి నియామకాలు చేపడుతున్నారు. ఈ గడువు ముగిసిన తర్వాత ప్రతి బ్యాచ్‌లో గరిష్ఠంగా 25 శాతం మందిని ప్రతిభ, సైనిక దళాల అవసరాల ఆధారంగా సాధారణ సర్వీసులో కొనసాగించే అవకాశం ఉంది. మిగిలినవారు విధుల నుంచి వైదొలగాల్సి వచ్చేది. తాజా నిర్ణయంతో వారికి అదనపు సేవా అవకాశం లభించనుంది. నియామక ప్రక్రియలోనూ మార్పులు ప్రకటించారు. ఇకపై శారీరక పరీక్షకు ముందుగా రాత పరీక్ష నిర్వహించనున్నారు. సైన్యంలో పనిచేసిన సమయంలో అగ్నివీరులు పొందిన శిక్షణ, నైపుణ్యాలను గుర్తిస్తూ ధ్రువపత్రాలు కూడా అందించనున్నారు. తొలి బ్యాచ్‌లో సుమారు 18 వేల మంది అగ్నివీరుల నాలుగేళ్ల సర్వీసు గడువు 2026 డిసెంబరులో ముగియనుండటంతో ఈ నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకుంది.

23న ఏపీలో మేయర్, ఛైర్‌పర్సన్‌ల ప్రమాణ స్వీకారం

మొదటిపేజీ తరువాయి - ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల ముగిసిన పురపాలక ఎన్నికల ప్రక్రియలో మరో కీలక ఘట్టానికి రంగం సిద్ధమైంది. రాష్ట్రంలోని నూతనంగా ఎన్నికైన మేయర్లు, మున్సిపల్ ఛైర్‌పర్సన్‌ల ప్రమాణ స్వీకారానికి రాష్ట్ర ఎన్నికల సంఘం ముహూర్తం ఖరారు చేసింది. ఈ నెల 23న వారు తమ బాధ్యతలను అధికారికంగా స్వీకరించనున్నారని ఎస్ఈసీ స్పష్టం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 13 కార్పొరేషన్లు, 77 మున్సిపాలిటీలు, 10 నగర పంచాయతీల్లో ఎన్నికల ఫలితాలు వెలువడిన సంగతి తెలిసిందే. ప్రజలు నేరుగా తమ నగర సారథులను ఎన్నుకోవడంతో, గెలుపొందిన అభ్యర్థులు ప్రమాణ స్వీకారం చేసేందుకు ఎస్ఈసీ తేదీని ఖరారు చేస్తూ తాజా ఉత్తర్వులు జారీ చేసింది. దీనితో కొత్త పాలకవర్గాల ఏర్పాటు ప్రక్రియ వేగవంతం కానుంది. అయితే, డిప్యూటీ మేయర్లు, వైస్ ఛైర్‌పర్సన్‌ల ఎన్నికపై ఇంకా స్పష్టత రాలేదు. ఈ పదవుల ఎన్నికకు సంబంధించిన తేదీలు, విధివిధానాలపై ఎస్ఈసీ నుంచి ప్రత్యేకంగా ప్రకటన వెలువడాల్సి ఉంది. గతంలో ఈ పదవులను పరోక్ష పద్ధతిలో కౌన్సిలర్లు ఎన్నుకునేవారు. అయితే, ఇప్పుడు మేయర్లు, ఛైర్‌పర్సన్ల ఎన్నిక ప్రత్యక్ష పద్ధతిలో జరిగినందున, డిప్యూటీ పదవుల ఎన్నిక ప్రక్రియకు సంబంధించి ఎస్ఈసీ కొత్త మార్గదర్శకాలను జారీ చేయనున్నట్లు తెలుస్తోంది. నవంబరు 23న మేయర్లు, ఛైర్‌పర్సన్‌లు బాధ్యతలు చేపట్టినప్పటికీ, పూర్తిస్థాయి పాలకవర్గాల ఏర్పాటుకు మరికొంత సమయం పట్టే అవకాశం ఉంది. ఎస్ఈసీ నుంచి తదుపరి ఆదేశాలు వెలువడిన తర్వాతే డిప్యూటీ మేయర్లు, వైస్ ఛైర్‌పర్సన్‌ల ఎన్నిక ప్రక్రియ ప్రారంభం కానుంది. అప్పటివరకు ఈ అంశంపై ఉత్కంఠ కొనసాగనుంది.

కండక్టర్ ప్రవళిక కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, ఉద్యోగం



మొదటిపేజీ తరువాయి - తల్లికి ప్రభుత్వ ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రి మార్చురీ వద్ద ప్రవళిక మృతదేహానికి మంత్రి నివాళులర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రవళిక కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం మిట్టగూడెం వద్ద అక్టోబర్ 25న ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. టికెట్ డబ్బుల చిల్లర విషయమై ప్రయాణికురాలు మౌనికతో జరిగిన గొడవలో... ప్రవళికను కదులుతున్న బస్సు నుంచి కిందకు తోసేయడంతో ఆమె వెనుక చక్రాల కింద పడి తీవ్రంగా గాయపడ్డారు. పది రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ నిన్న రాత్రి ఆమె కన్నుమూశారు. ఈ ఘటనపై ఇప్పటికే నిందితురాలైన ప్రయాణికురాలిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఇరాన్‌పై అణుదాడి జరిగితే భారత్‌కూ ముప్పు తప్పదా?


మొదటిపేజీ తరువాయి - ఇరాన్‌పై అమెరికా మరోసారి దాడులకు దిగుతుందా? అదే జరిగితే అణ్వాయుధాన్ని ప్రయోగిస్తుందా? ఇప్పుడు అంతర్జాతీయంగా ఈ ప్రశ్నలు చర్చనీయాంశంగా మారాయి. ఇరాన్‌లోని పిక్‌యాక్స్ పర్వతంపై అణుదాడి జరిగే అవకాశం ఉందంటూ వస్తున్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ దాడి జరిగితే వెలువడే రేడియేషన్ పాకిస్థాన్ మీదుగా వాయవ్య భారతదేశానికీ చేరే అవకాశముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయితే ఇది పూర్తిగా వాతావరణ పరిస్థితులు, పేలుడు తీవ్రతపై ఆధారపడి ఉంటుందని స్పష్టం చేస్తున్నారు. ఇరాన్‌లోని నటాంజ్ అణు కేంద్రానికి సమీపంలో పిక్‌యాక్స్ పర్వతం ఉంది. ఈ పర్వతం లోపల భూమికి సుమారు 100 మీటర్ల లోతులో భారీ సొరంగాల సముదాయం ఉన్నట్లు అంచనా. ఇక్కడ ఇరాన్ అణు శుద్ధి కార్యక్రమానికి సంబంధించిన కార్యకలాపాలు జరుగుతున్నాయనే అనుమానాలున్నాయి. ఈ ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకోవాల్సి రావొచ్చని ట్రంప్ గతంలో పలుమార్లు వ్యాఖ్యానించారు. తాజాగా కూడా అవసరమైతే గంటలోపే దాడి చేయగలమని పేర్కొన్నారు. అమెరికా మాజీ ఫాక్స్ న్యూస్ వ్యాఖ్యాత టక్కర్ కార్ల్‌సన్ ఈ అంశంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఒత్తిడితో ట్రంప్ ఇరాన్‌పై అణుదాడికి సిద్ధమవుతున్నారని ఆరోపించారు. నవంబర్ 7లోగా దీనిపై నిర్ణయం తీసుకోవచ్చని పేర్కొన్నారు. అయితే ఈ వాదనలకు ఆయన ఎలాంటి ఆధారాలు చూపలేదు. అమెరికా ప్రభుత్వం కూడా అణుదాడికి సిద్ధమవుతున్నట్లు అధికారికంగా ప్రకటించలేదు. గతంలో అణ్వాయుధాల ప్రయోగం అవసరం లేదని ట్రంప్ స్వయంగా చెప్పారు. పిక్‌యాక్స్ పర్వతంపై అణు పేలుడు జరిగితే వెలువడే రేడియోధార్మిక పదార్థాలు గాలి దిశను బట్టి పాకిస్థాన్, వాయవ్య భారతదేశం వైపు ప్రయాణించే అవకాశం ఉందని రక్షణ నిపుణుడు సందీప్ ఉన్నితన్ వివరించారు. పంజాబ్, రాజస్థాన్, జమ్మూకశ్మీర్, గుజరాత్ ప్రాంతాలకు తక్కువ మోతాదులో రేడియేషన్ చేరవచ్చని ఓ అంచనా సూచించింది. అయితే దూరం పెరిగేకొద్దీ దాని తీవ్రత తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు. వర్షాలు పడే ప్రాంతాల్లో రేడియోధార్మిక కణాలు స్థానికంగా ఎక్కువగా పేరుకుపోయే ప్రమాదం కూడా ఉందని హెచ్చరిస్తున్నారు. అణుదాడి జరిగితే దాని ప్రభావం ఇరాన్‌కే పరిమితం కాదని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. పర్షియన్ గల్ఫ్ ప్రాంతంతో పాటు ఇతర దేశాలపైనా ప్రభావం పడవచ్చు. అణుదాడి అంతర్జాతీయంగా తీవ్ర పరిణా మాలకు దారితీసే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. అయితే ప్రస్తుతానికి ఇదంతా సాధ్యాసాధ్యాలపై జరుగుతున్న చర్చ మాత్రమే. అమెరికా అణుదాడికి నిర్ణయం తీసుకున్నట్లు ఎలాంటి అధికారిక ప్రకటన లేదు.

సదర్ అంటే తెలంగాణ ఆత్మగౌరవం

మొదటిపేజీ తరువాయి - యాదవులు పండుగ నిర్వహించుకుంటారని తెలిపారు. సదర్ వేడుకలకు రూ.5 కోట్ల నిధులు కేటాయించామని వెల్లడించారు. సదర్ అంటే తెలంగాణ ఆత్మగౌరవమని, ఇది ఓ అద్భుతమైన కార్యక్రమమని సీఎం కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పండుగలాగా జరుపుతున్నామని, తమ ప్రభుత్వం వచ్చాక యాదవులను అన్ని విధాలుగా గౌరవిస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణలో అన్ని రాష్ట్రాల ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారని, యాదవులకు సముచిత స్థానం కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. తన చుట్టూ ఎప్పుడూ యాదవులు ఉంటారని, మంత్రివర్గ సమావేశాన్ని వాయిదా వేసుకొని సదర్ వేడుకకు హాజరయ్యానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. నగరంలో శాంతి భద్రతలు కాపాడుతూ, అందరిని ఒక తాటిపై ఉంచామని స్పష్టం చేశారు. "మూసీ ప్రక్షాళన, రీజినల్ రింగ్‌రోడ్డు, భారత్ ఫ్యూచర్ సిటీ, మెట్రోరైల్ విస్తరణ ఇవన్నీ కార్యక్రమాలు ముందుకు వెళ్లాలి. ఈ హైదరాబాద్ నగరం గ్లోబల్ నగరంగా ఎదగాలంటే ఈ అభివృద్ధి కార్యక్రమాలన్నీ జరగాలి. ఇవన్నీ జరగటానికి మీ అందరీ సహకారం ఈ ప్రభుత్వానికి ఉండాలి" – రేవంత్ రెడ్డి, తెలంగాణ సీఎంసదర్ ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. వ్యవసాయానికి పశుసంపద ఎంతో కీలకమని పశుసంపద అభివృద్ధి ద్వారానే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. సదర్ ద్వారా యాదవ సంస్కృతి ప్రపంచానికి చాటడమే కాదు, ఆర్థిక వ్యవస్థలో వారు భాగస్వామ్యం అవ్వాలని ఆకాంక్షించారు. యాదవ సమాజ ఐక్యత దేశవ్యాప్తంగా విస్తరించాలని బిహార్ మాజీ డిప్యూటీ సీఎం తేజస్వి యాదవ్ ఆకాంక్షించారు. జనాభా ప్రాతిపదికన అన్ని వర్గాలకు రిజర్వేషన్లు కల్పించాలన్నారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఎలాంటి పరిస్థితుల్లోనైనా పోరాడతామని స్పష్టం చేశారు. దేశంలో మరెక్కడా లేని విధంగా హైదరాబాద్‌లో ఈ వేడుకలు నిర్వహించడం ప్రత్యేకమని ఉత్తరప్రదేశ్ ఎంపీ ధర్మేంద్ర యాదవ్ అన్నారు. బలహీన వర్గాల ప్రజలంతా ఐకమత్యంతో ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.

కరవు కష్టాల నుంచి రైతన్నను గట్టెక్కించండి

కేంద్ర బృందానికి సీఎం చంద్రబాబు విజ్ఞప్తి



ఆంధ్రప్రదేశ్‌లో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితులతో వ్యవసాయ రంగం కుదేలైన నేపథ్యంలో, రైతులను, ప్రజలను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహాయం అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. రాష్ట్రంలో కరవు తీవ్రతను అంచనా వేసేందుకు పర్యటించిన కేంద్ర అంతర మంత్రిత్వ శాఖల బృందం (ఐఎంసీటీ) బుధవారం అమరావతిలో ముఖ్యమంత్రిని కలిసింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వం చేపడుతున్న ఉపశమన చర్యలను సీఎం వారికి సమగ్రంగా వివరించారు. రాష్ట్రంలోని వాస్తవ పరిస్థితులను కేంద్ర బృందానికి వివరిస్తూ, "ఒకవైపు తీరప్రాంతం తుఫాన్లతో నష్టపోతుంటే, మరోవైపు రాయలసీమ, ఇతర ప్రాంతాలు ఎల్ నినో ప్రభావంతో తీవ్ర కరవు కోరల్లో చిక్కుకున్నాయి" అని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది సాధారణం కంటే అత్యంత తక్కువ వర్షపాతం నమోదు కావడం వల్ల ఖరీఫ్ పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని తెలిపారు. ముఖ్యంగా రాయలసీమ జిల్లాల్లో పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా ఉందని, సాగునీటితో పాటు తాగునీరు, పశు గ్రాసానికి కూడా తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని వివరించారు. దేశంలోనే రెండో అత్యల్ప వర్షపాతం నమోదైన ప్రాంతంగా అనంతపురం జిల్లా నిలిచిన విషయాన్ని ఆయన బృందం దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే రాష్ట్రంలోని 21 జిల్లాల్లో 412 మండలాలను కరవు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించామని, పంట నష్టాలపై పూర్తిస్థాయి అంచనాలతో వారం రోజుల్లో కేంద్రానికి నివేదిక సమర్పిస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కరవు పరిస్థితుల నేపథ్యంలో గ్రామీణ ఉపాధిని, వ్యవసాయాన్ని ఆదుకునేందుకు ముఖ్యమంత్రి కొన్ని కీలక ప్రతిపాదనలు చేశారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి క్షేత్రస్థాయిలో మానవ వనరుల అవసరం ఎక్కువగా ఉంటుందని, ఈ నేపథ్యంలో 'వీబీ జీ రామ్ జీ' పథకం కింద పనిదినాలను 200 రోజులకు పెంచాలని కోరారు. ఈ పథకాన్ని వ్యవసాయ పనులకు అనుసంధానించడం ద్వారా రైతులకు కూలీల కొరత తీరడంతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని సూచించారు. కరవు కారణంగా రైతుల ఆదాయం పూర్తిగా పడిపోయిందని, గతంలో తీవ్ర కరవు వచ్చినప్పుడు రాయలసీమలో పది ఎకరాల రైతులకు కూడా రేషన్ కార్డులు ఇచ్చి ఆదుకున్నామని గుర్తుచేశారు. అదే తరహాలో ప్రస్తుతం అర్హులైన కరవు బాధిత కుటుంబాలకు 'డ్రాట్ కార్డులు' జారీ చేసే అంశాన్ని పరిశీలించి, కేంద్ర సహకారంతో నిత్యావసరాలను సబ్సిడీపై అందించాలని విజ్ఞప్తి చేశారు. దీంతో పాటు, రైతుల వ్యవసాయ రుణాలను రీషెడ్యూల్ చేసేందుకు కేంద్రం తోడ్పాటునందించాలని కోరారు.

హైకోర్టు ఆదేశాలు బేఖాతరు చేస్తున్న బోయిన్ పల్లి మున్సిపల్ అధికారులు

శివాజీనగర్‌లో అక్రమ నిర్మాణాలపై చర్యలేవీ?

ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణం పై ఆరోపణల వెల్లువ

3 నెలలు గడిచిన అమలుకు నోచుకోని హైకోర్టు ఉత్తర్వులు

సికింద్రాబాద్, నవంబర్ 04 (ప్రజా మంటలు): అక్రమ నిర్మాణాల పట్ల మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోయిన్ పల్లి సర్కిల్ -3 అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు మరోసారి వెలుగులోకి వచ్చాయి. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ఏకంగా గౌరవ హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ, సంబంధిత బోయిన్పల్లి సర్కిల్ -3 మున్సిపల్ అధికారులు క్షేత్రస్థాయిలో ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు, సామాజిక కార్యకర్తలు తీవ్ర విస్మయం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే...సికింద్రాబాద్ పరిధిలోని శివాజీ నగర్ లో శ్రీనాథ్ రెసిడెన్సీ పేరుతో మున్సిపల్ నంబర్ 8-1-221 లో స్టిల్ట్ ప్లస్ నాలుగు ఫ్లోర్లు అనుమతి లేకుండా నిర్మించారు. అలాగే డోర్ నంబర్ 8-1-222, 222/1 నుంచి 222/5 వరకు ఉన్న భవనంలో రెండవ ఫ్లోర్ మున్సిపల్ కార్పొరేషన్ కు మార్టిగేజ్ చేశారు. నిబంధన ప్రకారం ఈ ఫ్లోర్ మున్సిపల్ ఆధీనంలో ఉండాల్సి ఉండగా.. అలా చేయకుండా అక్రమార్కులు దీన్ని ఆక్రమించారని ఆరోపణలు ఉన్నాయి. ఇదే భవనంలో ఎలాంటి అనుమతి లేకుండా అదనంగా అక్రమంగా 5, 6,7 అంతస్తులను నిర్మించారు. ఇంటి నెంబర్లు 8-1-222/1 నుండి 8-1-222/5 వరకు రెండు భవనాల కు చెందిన స్థలం మొత్తం రెవిన్యూ రికార్డులో 920 గజాలు ఉండగా, ప్రస్తుతం ఈ రెండు భవనాలను కలిసి మొత్తం 969.69 చదరపు గజాల స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇందులో దాదాపు 40 గజాలు పైగా ప్రభుత్వ స్థలం ఉందని రికార్డుల ద్వారా తెలుస్తుందని కోర్టులో వేసిన పిటిషన్ లో పేర్కొన్నారు. అనుమతులకు మించి ప్రభుత్వ స్థలాన్ని సైతం ఆక్రమించి సాగిన ఈ నిర్మాణంపై గతంలోనే సంబంధిత ఉన్నతాధికారులు స్పీకింగ్ ఆర్డర్లు జారీ చేసినప్పటికీ, వాటిని క్షేత్రస్థాయిలో అమలు చేయకుండా కాలయాపన చేస్తూ వచ్చారు. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోయిన్పల్లి డిప్యూటీ కమిషనర్ దాకు నాయక్ ఏకపక్షంగా వ్యవహరిస్తూ అక్రమార్కులకు కొమ్ముకాస్తున్నరన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే బోయిన్పల్లి మున్సిపల్ కార్పొరేషన్ సర్కిల్ ఎసిపి , చైన్ మెన్ లు కూడా పక్షపాతంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఈ వ్యవహారంపై కోర్టులో డబ్ల్యూపీ నం. 27438/2026 పిటిషన్ దాఖలు కాగా, విచారణ చేపట్టిన హైకోర్టు అక్రమ నిర్మాణాలపై తగిన చర్యలు తీసుకోవాలని ఈ ఏడాది ఆగస్టు 20న స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. దాదాపు మూడు నెలలుగా మున్సిపల్ అధికారులు హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయకుండా బుట్టదాఖలు చేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆర్టీఐ, సామాజిక



కార్యకర్త కె. నరేష్ కుమార్ బోయిన్‌పల్లి సర్కిల్-3 డిప్యూటీ కమిషనర్ దాకు నాయక్‌కు లిఖితపూర్వక ఫిర్యాదు అందజేశారు. హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వులను తక్షణమే అమలు చేయాలని, ఇప్పటికే జారీ చేసిన స్పీకింగ్ ఆర్డర్ల ఆధారంగా ఆ అక్రమ నిర్మాణాలను జీహెచ్ఎంసీ, ఎంఎంసీ చట్ట నిబంధనల ప్రకారం వెంటనే కూల్చి వేయడమో లేదా సీజ్ చేయడమో చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కోర్టు ఆదేశాలు ఉన్నా క్షేత్రస్థాయిలో జాప్యం చేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, డిప్యూటీ కమిషనర్ దాకు నాయక్ ఈ వ్యవహారాన్ని అత్యవసరమైనదిగా పరిగణించి, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, వెంటనే తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి - ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి: జిల్లా ఎస్పీ అశోక్ కుమార్



మల్లాపూర్ నవంబర్ 4 (ప్రజా మంటలు) : మల్లాపూర్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లాలోని పోలీస్ స్టేషన్ల పనితీరు, నేరాల దర్యాప్తు పురోగతి, ప్రజలకు అందిస్తున్న పోలీస్ సేవలను నిరంతరం పర్యవేక్షించే క్రమంలో భాగంగా ఎస్పీ ఈ తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని కేసుల నమోదు, దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసుల వివరాలు తదితర అంశాలను ఎస్పీ పరిశీలించారు. ప్రతి కేసులో దర్యాప్తును నిబంధనల ప్రకారం సమర్థవంతంగా చేపట్టి, పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. గంజాయి, డ్రగ్స్, నిషేధిత పదార్థాల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా కొనసాగించాలని, యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు గ్రామాలు, విద్యాసంస్థలు, వ్యాపార సంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ఆన్‌లైన్ మోసాలు, ఓటీపీ, కేవైసీ, ఫేక్ ఇన్వెస్ట్‌మెంట్ యాప్‌లు, డిజిటల్ అరెస్ట్ వంటి మోసాలపై ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. రోడ్డు భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగంపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని, ప్రమాదకర డ్రైవింగ్, మైనర్ల వాహనాల వినియోగం, మోడిఫైడ్ సైలెన్సర్ల పై చట్టపరమైన చర్యలు కొనసాగించాలని తెలిపారు. ఎస్పీ వెంట మెట్ పల్లి సి.ఐ సురేష్ బాబు, ఎస్.ఐ అనిల్ మరియు సిబ్బంది ఉన్నారు.

పెండింగ్ సీఎంఆర్ బియ్యం సరఫరాను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి - జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్



జగిత్యాల నవంబర్ 4 (ప్రజా మంటలు) : పెండింగ్ సీఎంఆర్ బియ్యం డెలివరీపై రైస్ మిల్లర్లు, సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ రబీ 2024-25 సీజన్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న కస్టమ్ మిల్డ్ రైస్ (సీఎంఆర్) బియ్యం సరఫరాను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ సంబంధిత అధికారులను, రైస్ మిల్లర్లను ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో రాష్ట్రస్థాయి విజిలెన్స్ అధికారితో కలిసి సంబంధిత శాఖల అధికారులు, రైస్ మిల్లర్లతో జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ పెండింగ్ సీఎంఆర్ బియ్యం డెలివరీపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మిల్లుల వారీగా పెండింగ్‌లో ఉన్న అక్ల వివరాలు, బియ్యం సరఫరా పురోగతి, గడువులోగా లక్ష్యాలను పూర్తి చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు.

జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ

రబీ 2024-25 సీజన్‌కు సంబంధించి జిల్లాలో ఇంకా 2,564 ఏసికే ల సీఎంఆర్ డెలివరీ పెండింగ్‌లో ఉందని తెలిపారు. పెండింగ్ బియ్యం సరఫరాకు ప్రభుత్వం నవంబర్ 29, 2026 వరకు గడువు పొడిగించిందని పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న 24 రోజుల వ్యవధిలో పెండింగ్ బియ్యం సరఫరా పూర్తి చేసేలా ప్రతి మిల్లు తమకు నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎన్. ప్రసూనాంబ, డిఎస్వో జితేందర్ రెడ్డి, డిఎం సివిల్ సప్లై జితేంద్ర ప్రసాద్, రాష్ట్రస్థాయి విజిలెన్స్ అధికారి, సంబంధిత శాఖల అధికారులు, రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోలీస్ స్టేషన్‌పై అవగాహన కార్యక్రమం

ఎల్కతుర్తి నవంబర్ 4 ప్రజా మంటలు : ఎల్కతుర్తి మండలంలోని శాంతినగర్ సెంటాన్ హైస్కూల్ విద్యార్థులకు బుధవారం ఎల్కతుర్తి పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్ఓ) నరసింహారావు పోలీస్ స్టేషన్ పనితీరు, పోలీసుల విధులు, చట్టాలు, సామాజిక సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్ఓ నరసింహారావు మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి, సంఘటనకు సంబంధించిన పూర్వాపరాలను తెలుసుకున్న తర్వాత కేసు స్వభావాన్ని బట్టి తగిన సెక్షన్ల ప్రకారం కేసులు నమోదు చేస్తామని వివరించారు. పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ విధులు, ఇతర పోలీస్ సిబ్బంది బాధ్యతలు, ఫిర్యాదుల స్వీకరణ, కేసుల విచారణ తదితర అంశాలను విద్యార్థులకు వివరించారు. పోలీస్ స్టేషన్‌లోని వివిధ విభాగాలు, ఎస్ఐ కార్యాలయం, మహిళా విభాగం తదితర గదుల పనితీరును విద్యార్థులకు ప్రత్యక్షంగా చూపిస్తూ వాటి విధుల గురించి తెలియజేశారు. ముఖ్యంగా గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని, తెలిసీ తెలియని



వయసులో చెడు అలవాట్లకు బానిస కావద్దని సూచించారు. ఎక్కడైనా గంజాయి విక్రయాలు, వినియోగం లేదా అనుమానాస్పద కార్యకలాపాలు కనిపించినా వెంటనే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు లేదా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో సెల్‌ఫోన్లు, సోషల్ మీడియా వినియోగంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత ఫొటోలు, డీపీలు, ఇతర సమాచారాన్ని అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. విద్యార్థులు పోలీస్ అధికారులను చూసి భయపడాల్సిన అవసరం లేదని, పోలీసులు ప్రజల రక్షణ కోసమే పనిచేస్తారని ఒక తండ్రిలా ఆప్యాయంగా వివరిస్తూ వారిలో ధైర్యం, చట్టాల పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు పోలీస్ వ్యవస్థ పనితీరు, చట్టాలపై అవగాహనతో పాటు మత్తు పదార్థాల నివారణ, సైబర్ భద్రత, సామాజిక బాధ్యతలపై విలువైన సూచనలు అందించారు ఈకార్యక్రమంలో పాఠశాల హెడ్ మాస్టర్ తులసి ఉపాధ్యాయులు శ్రీనివాస్ పోలీసులు హెడ్ కానిస్టేబుల్ విఠల్ రావు హెడ్ కానిస్టేబుల్ వెంకట్ రెడ్డి ఉమెన్ కానిస్టేబుల్ సుప్రియ ఉమెన్ కానిస్టేబుల్ మోనికా ఉమెన్ కానిస్టేబుల్ దివ్య .భగవాన్. అగ్బర్.

అల్టిట్యూడ్ పాఠశాలలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

మాదకద్రవ్యాలు, ఆన్‌లైన్ గేమ్స్, సెల్‌ఫోన్ వినియోగంపై విద్యార్థులకు అవగాహన

ఎల్కతుర్తి, నవంబర్ 4 ప్రజా మంటలు : ఎల్కతుర్తి మండల కేంద్రంలోని సెయింట్ థామస్ అల్టిట్యూడ్ పాఠశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం, ఆన్‌లైన్ గేమ్స్, సెల్‌ఫోన్ దుర్వినియోగం, సైబర్ నేరాలు, వాటి వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. శంకర్ ఏఎస్ఐ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పలు కీలక అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శంకర్ ఏఎస్ఐ మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు అలవాటు పడటం వల్ల విద్యార్థుల భవిష్యత్తు నాశనమవుతుందని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసలుగా మారకుండా, సెల్‌ఫోన్‌ను అవసరమైన మేరకే వినియోగించాలని తెలిపారు. సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులతో పరిచయాలు, వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవడం వంటి చర్యల పట్ల అప్రమత్తంగా



ఉండాలని సూచించారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని, అనుమానాస్పద లింకులను క్లిక్ చేయకూడదని, ఎవరితోనూ ఓటీపీలు, వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దని వివరించారు. ఏదైనా సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పుష్కారి కార్తీక్ రావు మాట్లాడుతూ నేటి డిజిటల్ యుగంలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన ఎంతో అవసరమని అన్నారు. పోలీస్ అధికారులు ఇలాంటి అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తూ విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల పూర్తి అవగాహన కల్పించాలని కోరారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థులను చెడు మార్గాల నుంచి దూరంగా ఉంచడంతో పాటు వారి భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు సామాజిక బాధ్యత, క్రమశిక్షణ, నైతిక విలువలు అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ శంకర్‌తో పాటు పోలీస్ అధికారులు విటల్ రావు, వెంకట్ రెడ్డి, సుప్రియ, పాఠశాల ప్రిన్సిపల్ మర్రి అశోక్, వ్యాయామ ఉపాధ్యాయుడు కర్రె తిరుపతి తదితర ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఎల్కతుర్తి మండలంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవం



ఎల్కతుర్తి నవంబర్ 4 ప్రజా మంటలు : ఎల్కతుర్తి మండలంలో గౌరవ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు, స్పెషల్ ఆఫీసర్ ఆదిరెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీ సుకినె సంతాజీ ఎల్ ఎస్ సిఎస్, చైర్మన్ శ్రీ ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి చేతుల మీదుగా వివిధ గ్రామాల్లో ఐకేపీ ఎల్ ఎస్,సి ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించి, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు అన్ని అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్కతుర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, డైరెక్టర్లు ఏవొ రాజు కూమార్ ,ఐకెపి ఎపిఎం కవిత అంబాల శ్రీకాంత్ శనిగరపు వెంకటేశ్ ఇంగె శ్రీకాంత్ ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తూ, వ్యవసాయ రంగ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తోందని నాయకులు పేర్కొన్నారు

రైతు భరోసా జమ అయినట్లు మెసేజ్‌లు పంపి రైతులను అయోమయానికి గురిచేయడం సరికాదు

ప్రభుత్వం వెంటనే స్పందించాలి

ఎల్కతుర్తి నవంబర్ 4 ప్రజా మంటలు : రైతు భరోసా పథకం కింద రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేసినట్లు ముఖ్యమంత్రి పేరుతో సందేశాలు పంపుతున్నప్పటికీ, వాస్తవంగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కాకపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని తెలంగాణ రైతు రక్షణ సమితి హనుమకొండ జిల్లా అధ్యక్షులు హింగే భాస్కర్ ఆవేదన వ్యక్తం చేసింది. బుధవారం ఉదయం నాలుగున్నర గంటలకు మెసేజ్లు పలువురు రైతులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేరుతో వచ్చిన సందేశంలో రైతు భరోసా కింద రూ.11,850 తమ బ్యాంకు ఖాతాలో జమ చేసినట్లు పేర్కొన్నారు. అయితే బ్యాంకు ఖాతాలను పరిశీలించగా నగదు జమ కాకపోవడంతో రైతులు అయోమయానికి గురవుతున్నారు. ఒక ముఖ్యమంత్రి పేరుతో అధికారికంగా డబ్బులు జమ అయినట్లు సందేశాలు పంపినప్పుడు, ఆ మొత్తాలు రైతుల ఖాతాల్లో వాస్తవంగా జమ కావాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కేవలం సందేశాలు పంపి రైతులకు భరోసా కల్పించినట్లు ప్రచారం చేయడం సరైంది కాదు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతుల ఖాతాల్లో నగదు ఎందుకు జమ కాలేదో స్పష్టమైన వివరణ ఇవ్వాలి. మెసేజ్‌లు అందుకున్న రైతులందరికీ వెంటనే రైతు భరోసా నిధులు జమ చేయాలి. సాంకేతిక సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి. రైతులకు ప్రకటనలు కాదు.. ఆర్థిక భరోసా కావాలి. మెసేజ్‌లలో కనిపించే రైతు భరోసా బ్యాంకు ఖాతాల్లో కూడా కనిపించాలి. ఈ విషయంపై ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని తెలంగాణ రైతు రక్షణ సమితి తరపున డిమాండ్ చేస్తున్నాం.



మురికి నీటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

జలమండలి ఎండీని కలిసిన మర్రి శశిధర్ రెడ్డి



సికింద్రాబాద్, నవంబర్ 04 (ప్రజా మంటలు): సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో నెలకొన్న డ్రైనేజీ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని మాజీ మంత్రి, ఎన్డీఎంఏ మాజీ ఉపాధ్యక్షులు, బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు మర్రి శశిధర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో ఎండీ అశోక్ రెడ్డిని కలిసి నియోజకవర్గ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. రాంగోపాల్ పేట్ డివిజన్ ఆవులమంద వివేకానంద స్ట్రీట్‌లో గత కొన్ని నెలలుగా అసంపూర్తిగా నిలిచిపోయిన డ్రైనేజీ పనులను వెంటనే పూర్తి చేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. రంగ్రేజీ బజార్‌లో డ్రైనేజీ పనులు పూర్తి కాకుండానే రోడ్డు పనులు చేపట్టడం వల్ల తరచూ లీకేజీలు తలెత్తుతున్నాయని వివరించారు. మెక్ లాన్ గూడ్‌లో ప్రతిరోజూ మురికి నీరు రోడ్లపైకి చేరడమే కాకుండా, నల్లాల్లో కలుషిత నీరు సరఫరా అవుతుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అదేవిధంగా సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంత మురికి నీటిని క్లాసిగూడ నాలాకు కాకుండా పికెట్ నాలాకు మళ్లించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ సమస్యలన్నింటినీ యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో మహంకాళి - సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి నెమలి ఆనంద్, రాంగోపాల్ పేట్ డివిజన్ అధ్యక్షుడు సందీప్ వర్మతో పాటు బీజేపీ నాయకులు వి. దయానంద రావు, శ్రీనివాస్ యాదవ్, కిరణ్, బి. వికాస్, కె. నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులు కాలర్ ఎగరేసుకునేలా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపడతాం



రాయికల్ నవంబర్ 4(ప్రజా మంటలు) : గుడిసెలు లేని తెలంగాణే లక్ష్యం.. నిరుపేదలకు మొదటి ప్రాధాన్యత -- ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్. రాయికల్ మండలం చింతలూరు గ్రామ మాజీ ఉప సర్పంచ్ దరావత్ ప్రభాకర్ -- సునీత దంపతుల నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి హాజరైన జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ ఈ సందర్భంగా నూతన దంపతులకు చీరకానుక అందజేసి, ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించి శుభాకాంక్షలు తెలిపారు ఎమ్మెల్యే. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో మొదటి ప్రాధాన్యతగా గుడిసెలు, రేకుల షెడ్లలో నివసిస్తున్న నిరుపేదలకు అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. స్థానిక నాయకులు షేర్‌వాల్ టెక్నాలజీ, సిమెంట్ బ్రిక్స్‌తో తక్కువ బడ్జెట్‌లో నాణ్యమైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టే విధంగా చొరవ తీసుకోవడం అభినందనీయమని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక చొరవతో రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. జగిత్యాల అర్బన్ హౌసింగ్ కాలనీలో సుమారు 4,520 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం చేపట్టామని, అక్కడ మౌలిక సదుపాయాల కల్పనకు ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇటీవల కోటి రూపాయలకు పైగా నిధులతో సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించినట్లు తెలిపారు. అదేవిధంగా గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని, దెబ్బతిన్న రహదారుల మరమ్మతులు, అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వనిత రమేష్, ఆత్మ చైర్మన్ కాటిపెల్లి గంగారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు శేఖర్ రెడ్డి, మరిపెల్లి శ్రీనివాస్ గౌడ్, సీనియర్ నాయకులు కోల శ్రీనివాస్, సురేందర్ నాయక్, మోహన్ ప్రసాద్, ఉపసర్పంచ్ అల్లెపు నరసయ్య, మాజీ సర్పంచులు అనుపురం శ్రీనివాస్, మోహన్ రావు, వీఎస్ఎస్ చైర్మన్ ప్రణయ్, బాపురావు, మండల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, మండల, గ్రామ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.ం

ఉత్తమ మహిళా రైతును సత్కరించిన మాజీ జెడ్పి చైర్ పర్సన్ వసంత




సారంగాపూర్ నవంబర్ 4 (ప్రజా మంటలు) : మండలం పెంబట్ల గ్రామానికి చెందిన బండారి విజయ వెంకటేష్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చే ఉత్తమ మహిళా రైతు దివస్ అవార్డ్ అందుకున్న సందర్భంగా వారినీ పెంబట్ల గ్రామ మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో వారిని సన్మానించి శుభాకాంక్షలు తెలియజేసి జగిత్యాల జిల్లా తొలి జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ

కేంద్ర స్థాయిలో అవార్డు తీసుకున్న మన మున్నూరు కాపు బిడ్డ బండారి విజయ వెంకటేష్ కి శుభాకాంక్షలు అలాగే అవార్డు పొందిన మన మున్నూరు కాపు బిడ్డను సన్మానిస్తే ఇంకా మంచి ఉత్సాహంతో ముందుకు వెళ్తారని అన్నారు. పెంబట్లనే చిన్న గ్రామాన్ని దేశస్థాయిలో నిలిపినటువంటి ఘనత బండారి విజయ వెంకటేష్ గార్ల కష్టానికి చెందుతుందని అన్నారు. కెసిఆర్ దూర దృష్టి తోటి దేశమంతా కరువచ్చినా కూడా తెలంగాణకు కరువు రావద్దని ఉద్దేశంతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారని అన్నారు. కెసిఆర్ మీద కోపంతో రైతులకు ద్రోహం చేస్తుంది ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అని అన్నారు. ఎలీనో ప్రభావంతో రైతులకు పంటలు వేయొద్దని చెప్తున్నారు మరి రైతులు రైతుల పరిస్థితి ఏంటి అని ప్రశ్నించారు. రైతు ప్రతి రైతుకు ఎకరానికి 25000 చొప్పున ఆర్థిక సహాయం చేసి సన్న చిన్న కారు రైతులను ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ ఎస్ నాయకులు తేలు రాజు సర్పంచ్ లు రమేష్ రామ భాస్కర్ మున్నూరు కాపు సంఘ అధ్యక్షులు బాదినేని రవి శేఖర్ మున్నూరు కాపు మండల అధ్యక్షుడు బాదినేని వెంకటేష్ తేలు లక్ష్మీ రాజం వార్డ్ సభ్యులు తేలు విజయ,చుక్క దుబ్బన్న మహేష్ తేలు వంశీ నరేష్ అత్తెనెనే నరేష్ ఒడ్నాల రాజేశం మల్లయ్య మున్నూరు కాపు కుల బాంధవులు నాయకులు తదితరులు ఉన్నారు.

శ్రీకృష్ణ సదర్ సమ్మేళనం యాదవుల ఆత్మగౌరవ ప్రతీక

పీసీసీ వైస్ ప్రెసిడెంట్ డా.కోట నీలిమ



సికింద్రాబాద్, నవంబర్ 04 (ప్రజా మంటలు): శ్రీకృష్ణ సదర్ సమ్మేళన ఉత్సవం యాదవుల ఆత్మగౌరవానికి, సంస్కృతి సంప్రదాయాలకు, సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని పీసీసీ ఉపాధ్యక్షురాలు, సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమ పేర్కొన్నారు. ఎన్టీఆర్ స్టేడియంలో మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన శ్రీకృష్ణ సదర్ సమ్మేళన ఉత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, యాదవ సోదరులు, మహిళలు, అభిమానులతో కలిసి వేడుకల్లో పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా కోట నీలిమ మాట్లాడుతూ గోపాలకుడిగా, ధర్మ పరిరక్షకుడిగా, భగవద్గీత బోధకుడిగా శ్రీకృష్ణుడు సమస్త మానవాళికి అందించిన సందేశాలు నేటికీ ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు. శ్రీకృష్ణుడి జీవితం ధర్మం, కర్తవ్యం, ప్రేమ, సమానత్వం, మానవతా విలువలకు మార్గదర్శకమని కొనియాడారు. సమాజంలో పశుసంపద పరిరక్షణతో పాటు వ్యవసాయం, పాడి పరిశ్రమ రంగాల అభివృద్ధిలో యాదవులు అందిస్తున్న సేవలు ఎంతో కీలకమైనవని ప్రశంసించారు. ఇలాంటి ఉత్సవాలు యాదవ సోదరులందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి, యువతలో తమ వారసత్వం పట్ల గౌరవాన్ని పెంపొందిస్తూ సామాజిక ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని స్పష్టం చేశారు. శ్రీకృష్ణుడి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించిన ఆమె, ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించినందుకు శ్రీకృష్ణ సదర్ సమ్మేళన కమిటీ చైర్మన్ అంజన్ కుమార్ యాదవ్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, తెలంగాణ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ యాదవ్ తదితరులను అభినందిస్తూ యాదవ సోదరులందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

ఏపీపీఎస్సీ గ్రూప్-1 కేసు ఏపీ, తెలంగాణలో ఈడీ సోదాలు

ఏపీపీఎస్సీ గ్రూప్-1 కేసులో ఎన్ ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సోదాలు నిర్వహిస్తోంది. ఇవాళ ఉదయం నుంచి ఏడు చోట్ల సోదాలు జరుగుతున్నాయి ఏపీపీఎస్సీ గ్రూప్-1 మూల్యాంకన అక్రమాల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన మూల్యాంకన వ్యవహారంలో మనీలాండరింగ్ కోణాన్ని నిగ్గుతేల్చేందుకు ఈడీ రంగంలోకి దిగింది. ఈ క్రమంలోనే ఇవాళ ఉదయం నుంచి ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో మొత్తం ఏడుచోట్ల ఈడీ సోదాలు చేపట్టింది. రంగారెడ్డి జిల్లా కాశీమ్‌బౌలిలోని పీఎస్ఆర్ ఆంజనేయులు నివాసంతో పాటు హైదరాబాద్ పంచవటి కాలనీ, పంజాగుట్ట, నేరేడ్‌మెట్, సికింద్రాబాద్‌లోని ట్రూగ్రేడర్ సంస్థ, అల్వాల్‌లోని వెంకటాపురంలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. మంగళగిరి సమీపంలోని హాయ్‌ల్యాండ్‌లోని ఆవాస రిసార్ట్‌లో సోదాలు కొనసాగుతున్నాయి. ఈ కేసులో మనీలాండరింగ్ కోణంలో ప్రధాన నిందితుడిగా ఉన్న ఏపీపీఎస్సీ మాజీ కార్యదర్శి పీఎస్ఆర్ ఆంజనేయులుతో పాటు



క్యామ్‌సైన్ మీడియా, ఇతర ప్రైవేట్ సంస్థల ఆర్థిక లావాదేవీలపై ఈడీ అధికారులు ఆరా తీస్తున్నారు. మూల్యాంకనానికి నిధులు, కాంట్రాక్టుల కేటాయింపులు, ఆర్థిక అక్రమాల ఆరోపణలపై విచారణ జరుపుతున్నారు. 2018లో 169 గ్రూప్-1 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారు. 2020 డిసెంబర్‌లో మెయిన్స్ నిర్వహించారు. డిజిటల్‌తో పాటు 2 దశల్లో మాన్యువల్ మూల్యాంకనం జరిగినట్లు సిట్ నివేదికలో తేలింది. మంగళగిరి వద్ద హాయ్‌ల్యాండ్ రిసార్ట్‌లో 84 రోజులపాటు మూల్యాంకనం జరిగినట్లు గుర్తించింది. అర్హత లేని 66 మందితో గ్రూప్-1 జవాబు పత్రాల మూల్యాంకనం చేయించారని ఆరోపించింది. క్యామ్‌సైన్ మీడియాకు రూ.1.14 కోట్లు, డిజిటల్ మూల్యాంకన సంస్థలకు రూ.1.38 కోట్లు చెల్లించినట్లు దర్యాప్తులో వెల్లడించింది. 287 బార్‌కోడ్ అసమానతలు, 169 స్లిప్పుల్లో కరెక్షన్ ఫ్లూయిడ్ వినియోగించినట్లు సిట్ నివేదికలో పేర్కొంది. 173 మంది సాక్షులను విచారించి ఫోరెన్సిక్ ఆధారాలను పరిశీలించింది. మూల్యాంకన అక్రమాలపై 2025 ఏప్రిల్‌లో పోలీసు కేసు నమోదు చేసింది. పీఎస్ఆర్ ఆంజనేయులు, క్యామ్‌సైన్ మీడియా డైరెక్టర్ మధుసూదనరావు గతంలో అరెస్ట్ చేసింది. సిట్ దర్యాప్తు దృష్ట్యా 2026 అక్టోబర్‌లో మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఈడీ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఈరోజు చేపట్టిన సోదాలతో ఈ వ్యవహారంలో ఆర్థిక లావాదేవీల వెనుక ఉన్న అంశాలపై ఈడీ దర్యాప్తు మరింత కీలకంగా మారింది.

ముంచేసిన మురసు అస్తవ్యస్తమైన జనజీవనం

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మురసు తుపాను బీభత్సం సృష్టించింది. భీకరగాలులు, వర్షంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. పలు చోట్ల భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. మురసు తీవ్ర తుపాను ఏపీపై విరుచుకుపడింది. పలు జిల్లాల్లో ఈదురుగాలులు, భారీ వర్షాలు కురవడంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. పెద్దచెట్లు, స్తంభాలు నేలకూలి ఎక్కడికక్కడ అడ్డంకులు ఏర్పడ్డాయి. వాగులు, వంకలు పొంగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. వేల ఎకరాల్లో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. లోతట్టు ప్రాంతాలు జలయమం కావడంతో ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. తుపాను ధాటికి వేర్వేరు ఘటనల్లో నలుగురు మృతిచెందారు. నలుగురు గల్లంతయ్యారు. బాపట్ల జిల్లా రేపల్లె నియోజకవర్గంలో రాత్రి నుంచి ఎడతెరపి లేని వర్షం కురుస్తోంది. చల్లని ఈదురు గాలులతో వర్షం కురుస్తుండటంతో ప్రజలు బయటికి రాలేని పరిస్థితి నెలకొంది. వర్ష ప్రభావానికి రేపల్లె-నిజాంపట్నం ప్రధాన రహదారిలో పలుచోట్ల రోడ్లు జలమయ్యాయి. వాహనదారులకు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందిగా మారింది. నిజాంపట్నం, రేపల్లె మండలాలలో 42 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. ముంపుకు గురయ్యే ప్రాంతాలలోని సుమారు 600 మందిని రేపల్లె ఆర్డీవో శ్రీదేవి పునరావాస కేంద్రాలకు తరలించారు. పల్నాడు జిల్లా అతలాకుతలమైంది. జిల్లావ్యాప్తంగా సగటున 4.73 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. తుపాను ధాటికి పలు రైళ్లను సైతం నిలిపివేశారు. గంటకు 50 నుంచి 100 కిలోమీటర్ల వేగంతో వీసిన ఈదురుగాలులతో భారీ చెట్లు పడిపోయాయి. విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. అధికారులు సహాయ చర్యలు చేపట్టారు. చిలకలూరిపేటను వరద నీరు ముంచెత్తింది. భారీ వర్షానికి చెన్నై-కోల్‌కతా హైవేపై వరద నీరు ప్రవహిస్తోంది యడ్లపాడు మండలంలో 26.82 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. తిమ్మాపురం వద్ద హైవేపై నక్క వాగు పొంగడంతో కారు చిక్కుకుపోయింది. అందులో ఉన్న ఐదుగురిలో ముగ్గురిని గ్రామస్థులు కాపాడారు. ఇద్దరు వాగులో కొట్టుకుపోయారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఎన్డీఆర్ఎఫ్ బృందాలను పిలిపించారు. గల్లంతైన వారి కోసం గాలిస్తున్నారు. సత్తెనపల్లిలో కొన్ని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. రహదారులపై వర్షపు నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. నరసరావుపేటలో పలుచోట్ల వాగులు ఉప్పొంగాయి. పత్తి, మిరప ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. రైళ్లు నిలిచిపోవడంతో ప్రయాణికుల అవస్థలు: బాపట్లజిల్లా చిగురుటాకులా వణికింది. ఎడతెరిపిలేని గాలి వానతో ప్రజలు భీతిల్లారు. బాపట్ల, చీరాలలోని లోతట్టు ప్రాంతాలు, తీర మండలాల్లోని 19 గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. ప్రచండ గాలులకు చెట్లు పడిపోగా, 800 స్తంభాలు నేలకొరినట్లు సమాచారం. ఈదురుగాలులకు జిల్లాలో ముగ్గురు వ్యక్తులు చనిపోయారు. బాపట్ల రైల్వే స్టేషన్లలో కొన్ని రైళ్లు గంటల తరబడి నిలిచిపోయాయి. భారీ వర్షాలకు, ఈదురగాలులకు చీరాల ప్రాంతంలో జనజీవనం అస్తవ్యస్తమైంది. చీరాలలో ఆర్టీసీ బస్సులను సైతం నిలిపివేశారు. చీరాల మండలం వాడరేవు, రామాపురం, కఠారిపాలెం తీర ప్రాంతాల్లో సముద్రం అల్లకల్లోలంగా మారింది. ఎమ్మెల్యే కొండయ్య తీర ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితులను పరిశీలించారు. పర్చూరు, ఇంకొల్లు, మార్టూరు, యద్దనపూడి మండలాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఈదురుగాలులకు చిన్నగంజాం టోల్ ప్లాజా వద్ద ఐరన్ కంటైనర్ కూలిపడింది. ఈ ఘటనలో టోల్ సిబ్బంది అగస్టిన్ మృతి చెందారు. అంతేకాకుండా పెద్ద విద్యుత్ స్తంభం రోడ్డుపై పడిపోవడంతో వాహనాలు నిలిచిపోయాయి. జిల్లావ్యాప్తంగా 70,000ల ఎకరాల్లో వరి, 16,450 ఎకరాల్లో ఉద్యానపంటలు ముంపు బారినపడ్డాయి. పూర్తిగా నష్టపోయామని రైతులు లబోదిబోమంటున్నారు. వేల ఎకరాల్లో పంట నష్టం: గుంటూరు జిల్లాలో మురసు తుపాను బీభత్సం సృష్టించింది. ఎడతెరపిలేని వర్షాలకు గుంటూరు శివారు కాలనీలను వరద నీరు ముంచెత్తింది. ఫిరంగిపురంలో 17.28 సెంటీమీటర్లు, గుంటూరు పశ్చిమ 13.74, కాకుమాను 13.32, పెదకాకాని 13.26 శాతం వర్షపాతం నమోదైంది. ప్రత్తిపాడు నియోజకవర్గంలో మురసు తుపాను బీభత్సం సృష్టించింది. గొట్టిపాడులో వాగులు పొంగి పొర్లాయి. మిరప, పత్తి పైరులు నీట మునిగాయి. వింజనంపాడులో మిరప పంట నీట మునిగింది. కాకుమాను , పెదనందిపాడు మండలాల్లో పెద్దఎత్తున వర్షం పడింది. నల్లమడ వాగుకు భారీగా వరద నీరు చేరింది. వరి పైరులన్నీ నీటిలో నానుతున్నాయి. పెదనందిపాడులో వర్షం కారణంగా ఇళ్లలోకి నీరు చేరింది. జిల్లావ్యాప్తంగా 39 పునరావాస కేంద్రాలు ఏర్పాటుచేసి 2316 మందిని తరలించారు. పలు చోట్ల వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మంగళగిరిలో భారీ వర్షాలు కురిశాయి. కాజా టోల్ వద్ద వరద నీరు ప్రవహించడంతో విజయవాడ వైపు వెళ్లే రెండు మార్గాలను మూసేశారు. హైవేపై మోకాళ్లలోతు నీరు చేరడంతో వాహనాలు మెల్లగా కదులుతున్నాయి. ప్రజలు భయంతో జాతీయ రహదారిపై పైకి వచ్చారు. రైల్వేస్టేషన్‌లో 2000ల మంది ప్రయాణికులకు తహసీల్దార్ ఆధ్వర్యంలో ఆహారం పంపిణీ చేశారు. నేలకొరిగిన భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు: తుపాను ప్రభావంతో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో జనజీవనం స్తంభించింది. ఒంగోలు నగరంలో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు భారీగా ధ్వంసం కావడంతో చీకట్లు అలుముకున్నాయి. చెట్లు ఎక్కడికక్కడే నేలకొరిగాయి. ఒంగోలు కలెక్టరేట్‌లో భారీ వృక్షాలు కూలి ప్రకాశం పంతులు విగ్రహం ధ్వంసమైంది. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు చెట్లను తొలగించే పనులు చేపట్టాయి. నాగులుప్పలపాడు



మండలంలో అత్యధికంగా 22.8 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. గాలులకు పలు గ్రామాల్లో ఇళ్లపై రేకులు ఎగిరిపోయాయి. పూరిళ్లు నేలమట్టమయ్యాయి. ఒంగోలు, టంగుటూరు మండలాల్లోనూ పలు ఇళ్లు దెబ్బతిన్నాయి. గుండమాలలో సముద్రపు కెరటాలతో పలువురి మత్స్యకారుల బోట్లు గల్లంతయ్యాయి. విద్యుత్ స్తంభాలు భారీగా పడిపోవడంతో రోజంతా కరెంట్ సరఫరా నిలిచిపోయింది. తుపాను ప్రభావంతో ఆర్టీసీ బస్సులు డిపోల్లోనే నిలిచిపోయాయి. కొత్తపట్నం సమీపంలోని బకింగ్‌హాం కాలువలో ప్రమాదవశాత్తూ జారిపడి ఓ మహిళ గల్లంతయ్యారు. అద్దంకి, దర్శి ప్రధాన రహదారిపై చెట్లు విరిగిపడడంతో రవాణాకు అంతరాయం కలిగింది. ప్రజలు ట్రాక్టర్లతో వాటిని తొలగించారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో భారీ వర్షం కురిసింది. సగటున 6.6 సెంటీ మీటర్ల వర్షం పడింది. విజయవాడ నగరం, శివారు ప్రాంతాల్లో అధిక వర్షపాతం నమోదైంది. లోతట్టు ప్రాంతాలు జలదిగ్బంధంలో ఉన్నాయి. ఇబ్రహీంపట్నంలో 10.3 సెంటీమీటర్ల వర్షం కురిసింది. ప్రకాశం బ్యారేజీ వద్ద పది గేట్లను ఒక అడుగు మేర ఎత్తారు. సముద్రంలోకి 7,250 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో మంత్రి పర్యటన: పశ్చిమగోదావరి జిల్లాలో 8.04 సెంటీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. జిల్లా కేంద్రమైన భీమవరంతో పాటు పాలకొల్లు, తణుకు, నరసాపురం పట్టణాల్లో ప్రధాన కూడళ్లు సైతం ముంపులో చిక్కుకున్నాయి. భీమవరం బస్టాండులో మోకాళ్లలోతు నీరు నిలిచింది. భారీ వర్షానికి ఆచంట మండలంలో జనజీవనం స్తంభించింది. యలమంచిలి మండలంలోని తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో మంత్రి నిమ్మల రామానాయుడు పర్యటించారు. భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మురసు తుపాను ప్రభావంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వర్షాలు దంచికొట్టాయి. రాజమహేంద్రవరం, కొవ్వూరులో కుండపోత వర్షానికి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కోనసీమ జిల్లాలో ఎడతెరిపి లేని వర్షాలకు ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. పల్లపు ప్రాంతాలు, రోడ్లు జలమయమయ్యాయి.

ఆర్టీసీ కండక్టర్ ప్రవళిక మృతి సీఎం సంతాపం రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా

ప్రయాణికురాలు బస్సు నుంచి నెట్టివేయడంతో బస్సు కింద పడి గాయాలపాలైన కండక్టర్ ప్రవళిక ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఇవాళ మృతిచెందారు. టికెట్ చిల్లర విషయంలో ఆర్టీసీ బస్సులో తలెత్తిన వివాదం మహిళా కండక్టర్ ప్రాణాలను బలిగొంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు డిపోనకు చెందిన కండక్టర్ గుండ్ల ప్రవళిక చికిత్స పొందుతూ మృతి చెందింది. చిల్లర విషయంలో కండక్టర్ ప్రవళికకు మరో మహిళా ప్రయాణికురాలితో తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో కోపంతో ఊగిపోయిన మహిళా ప్రయాణికురాలు, కదులుతున్న బస్సులోంచి కండక్టర్ ప్రవళికను బయటకు నెట్టేసింది. అనూహ్యంగా కిందపడిపోయిన కండక్టర్ కాళ్లపై నుంచి బస్సు వెనక చక్రాలు వెళ్లడంతో రెండు కాళ్లు నలిగిపోయాయి. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రవళిక ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మంగళవారం తుదిశ్వాస విడిచింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కాగా కండక్టర్ ప్రవళిక మృతి పట్ల ఆర్టీసీ కార్మికులు, యూనియన్ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి, సంతాపం వ్యక్తం చేశారు. ఆమె కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలవాలని, ఆర్థిక సహాయంతో పాటు కుటుంబానికి అవసరమైన సహకారం అందించాలని యూనియన్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సీఎం సంతాపం

కండక్టర్ గుండ్ల ప్రవళిక మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేశారు. ప్రవళిక కుటుంబానికి



రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని, అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ముఖ్యమంత్రి కార్యాలయం పేర్కొంది.

రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటన

మణుగూరు డిపో ఆర్టీసీ కండక్టర్ ప్రవళిక మృతి పట్ల మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆమె కుటుంబానికి ప్రభుత్వం, ఆర్టీసీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. మరోవైపు ప్రవళిక కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియాను ప్రకటించింది. ఆమె తల్లికి ఉద్యోగంతో పాటు, ఇంటిని మంజూరు చేస్తామని తెలిపింది. ప్రవళిక మృతిపట్ల టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆమె అకాల మరణం ఆర్టీసీకి తీరని లోటని తెలిపారు. ప్రవళిక కుటుంబానికి అండగా ఉంటామని నాగిరెడ్డి తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీతో ఆయన మాట్లాడారు. ప్రవళిక మృతికి నిరసనగా ఖమ్మం రీజియన్ వ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులు బంద్‌కు పిలుపునిచ్చారు. బస్సులు నడవకపోవడంతో దీంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అసలేం జరిగిందంటే

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మిట్టగూడెంనకు చెందిన ఓ ప్రయాణికురాలు గత నెల 25న మణుగూరు నుంచి భద్రాచలం వైపు వెళ్తున్న మణుగూరు ఆర్టీసీ డిపోనకు చెందిన పల్లె వెలుగు బస్సు ఎక్కారు. ఆమెతో పాటు ఉన్న బాలుడికి టికెట్ తీసుకోవాలని మహిళా కండక్టర్ చెప్పారు. అయితే మొదట టికెట్ తీసుకునేందుకు ప్రయాణికురాలు నిరాకరించింది. కండక్టర్‌తో గొడవకు దిగింది. అనంతరం బాలుడికి టికెట్ తీసుకునేందుకు అంగీకరించింది. టికెట్ కోసం కండక్టర్‌కు ప్రయాణికురాలు నగదు ఇచ్చారు.

చిల్లర విషయంలో పెరిగిన వివాదం

టికెట్ ఇచ్చిన మహిళా కండక్టర్ ప్రవళిక దిగేటప్పుడు మిగిలిన చిల్లర తీసుకోవాలని ప్రయాణికురాలికి సూచించారు. అయితే ఇప్పుడే చిల్లర ఇవ్వాలని ప్రయాణికురాలు పట్టుబట్టింది. దీంతో వారి మధ్య మరోసారి మాటామాటా పెరిగింది. ఈ క్రమంలో మిట్టగూడెం స్టాప్ రావడంతో ఆమె బస్సు దిగేందుకు ప్రయత్నించగా, ప్రయాణికురాలిని అశ్వాపురం పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లాలని కండక్టర్ ప్రయత్నించారు. ఈ మేరకు బస్సును ముందుకు నడపాలని డ్రైవర్‌కు కండక్టర్ సూచించగా, బస్సు కదులుతున్న సమయంలో ప్రయాణికురాలు కండక్టర్‌ను నెట్టివేసింది. దీంతో కండక్టర్ కదులుతున్న బస్సు వెనక చక్రాల కింద పడిపోయారు. ఈ ప్రమాదంలో ఆమె కాలికి తీవ్ర గాయాలయ్యాయి. ఆరోజు నుంచి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కండక్టర్ ఆరోగ్య పరిస్థితి విషమించి మంగళవారం రాత్రి మృతి చెందింది.

మెప్మా అదనపు మిషన్ డైరెక్టర్ ఇంట్లో ఏసీబీ సోదాలు

భారీగా అక్రమాస్తులు గుర్తింపు

మెప్మా అదనపు మిషన్ డైరెక్టర్ నల్లగుంట్ల యాదగిరి రావుపై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. ఇప్పటివరకు రూ.4 కోట్లకు పైగా విలువైన ఆస్తులను గుర్తించారు. మెప్మా అదనపు డైరెక్టర్ నల్లగుంట్ల యాదగిరి రావుపై తెలంగాణ ఏసీబీ అధికారులు ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేశారు. ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలతో ఏసీబీ అధికారులు ఆయన ఇల్లు, కార్యాలయాలతో పాటు బంధువులు, బినామీలకు చెందిన మొత్తం 10 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భారీగా అక్రమాస్తులు వెలుగు చూశాయి. హైదరాబాద్, సూర్యాపేట, నల్గొండ జిల్లాల్లో 12 ఓపెన్ ప్లాట్లు, ఉప్పల్‌లో 2 కోట్ల విలువ చేసే జీ+3 భవనం, రెండు ఫ్లాట్లు, ఒక వాణిజ్య సముదాయంతో పాటు సూర్యాపేటలో ఒక ఇల్లు ఉన్నట్లు అధికారులు గుర్తించి పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు 1.7 కిలోల బంగారు ఆభరణాలు, 3 కిలోల వెండి, టొయోటా ఫార్చ్యూనర్‌తో సహా రెండు కార్లు, మూడు ద్విచక్ర వాహనాలు, బ్యాంకుల్లో రూ.32.30 లక్షల నగదు, భారీగా గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువులను సీజ్ చేశారు. ఈ ఆస్తుల విలువ సుమారు రూ.4.75 కోట్లుగా నిర్ధారించారు. బహిరంగ మార్కెట్‌లో ఈ ఆస్తుల విలువ ఇంకా చాలా రెట్లు ఎక్కువగా ఉంటుందని ఏసీబీ అధికారులు వెల్లడించారు. అక్రమ ఆస్తులపై దర్యాప్తు ఇంకా కొనసాగుతోంది. ఏసీబీ అధికారులు నిందితుడిని హైదరాబాద్‌లోని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించనున్నారు. ప్రభుత్వ రికార్డుల ప్రకారం ఇప్పటివరకు గుర్తించిన ఆస్తుల విలువ రూ.4 కోట్లకు పైగా ఉండగా బహిరంగ మార్కెట్‌లో వీటి విలువ మరింత ఎక్కువగా ఉండే అవకాశముందని ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్ వెల్లడించారు మరోవైపు యాదగిరిరావు కుమారుడి పెట్టుబడులకు సంబంధించిన రబ్బరు ఫ్యాక్టరీ, ట్రాన్స్‌మిషన్ ఇండస్ట్రీస్ వివరాలపైనా అధికారులు ఆరా తీస్తున్నారు. 10 ప్రాంతాల్లో సోదాలు కొనసాగుతున్నాయని, పూర్తిస్థాయి తనిఖీల అనంతరం మరిన్ని వివరాలు వెల్లడిస్తామని ఏసీబీ అధికారులు తెలిపారు. యాదగిరి రావును కోర్టులో హాజరుపరచనున్నట్లు డీఎస్పీ ఆనంద్‌కుమార్ పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లాలో ఏసీబీ మరో ప్రభుత్వ ఉద్యోగిని పట్టుకుంది. సదాశివపేట మండల వ్యవసాయాధికారి రమేశ్ స్థానిక ఎరువుల వ్యాపారి వద్ద



రూ.20 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు. మొదటగా రూ.30 వేలు లంచం డిమాండ్ చేయగా ఇంతకు ముందే రూ.10 వేలు ఇచ్చారు. నేడు మరో రూ.20 వేలు తీసుకుంటుండగా పక్కా సమాచారంతో ఏసీబీ అధికారులు రమేశ్‌ను పట్టుకున్నారు.

కేటీఆర్ చొరవతో స్వదేశానికి.. మస్కట్ బాధితురాలి కృతజ్ఞతలు

ఉపాధి కోసం మస్కట్ వెళ్లి చిక్కుకుపోయిన మహిళ

కేటీఆర్ చొరవతో సురక్షితంగా స్వదేశానికి వచ్చిన కొడంగల్ మహిళ

తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపిన బాధితురాలు



ఉపాధి కోసం మస్కట్ వెళ్లి మోసపోయి, అక్కడే చిక్కుకుపోయిన తెలంగాణ మహిళ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చొరవతో సురక్షితంగా స్వదేశానికి తిరిగి వచ్చారు. కొడంగల్ నియోజకవర్గానికి చెందిన బాధితురాలు తుప్పుడు లక్ష్మి, మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను తన కుటుంబంతో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వివరాల్లోకి వెళితే, కొడంగల్ నియోజకవర్గంలోని గోకఫస్లాబాద్ గ్రామానికి చెందిన లక్ష్మి ఈ ఏడాది ఫిబ్రవరిలో ఉపాధి కోసం మస్కట్ వెళ్లారు. అయితే, ఏజెంట్ చెప్పిన పనికి బదులుగా అక్కడ వేరే పని అప్పగించారు. యజమాని (కఫీల్) ఆమె పాస్‌పోర్టును స్వాధీనం చేసుకుని, స్వదేశానికి తిరిగి పంపేందుకు నిరాకరించాడు. ఆమెను వెనక్కి పంపాలంటే ఏజెంట్ రూ. 2 లక్షలు డిమాండ్ చేయడంతో కుటుంబం ఆందోళనకు గురైంది. ఈ క్రమంలో లక్ష్మి కుమారుడు రాజు సెప్టెంబర్ 29న కేటీఆర్‌ను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. స్పందించిన కేటీఆర్, నెల రోజుల్లో తన తల్లిని క్షేమంగా వెనక్కి రప్పిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం, ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి లక్ష్మి నవంబర్ 2న హైదరాబాద్ చేరుకునేలా ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ, "నెల రోజుల్లో నన్ను వెనక్కి తీసుకొస్తానని కేటీఆర్ అన్న మా అబ్బాయికి మాట ఇచ్చారు. ఆయన ఆ మాట నిలబెట్టుకున్నారు. నా కుటుంబానికి ఆయన చేసిన సహాయాన్ని ఎప్పటికీ మర్చిపోలేను" అని భావోద్వేగంగా తెలిపారు. ది హిందూ కథనం ప్రకారం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గానికి చెందిన మహిళకు కేటీఆర్ సహాయం చేయడం గమనార్హం.

పట్టభద్రులకు ఊరట: తెలంగాణలో ఎమ్మెల్సీ ఓటు నమోదు గడువు పొడిగింపు

ఆన్‌లైన్ పోర్టల్‌లో సాంకేతిక సమస్యలతో ఈసీ నిర్ణయం

నామినేషన్ల చివరి తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం

నవంబర్ 25న ముసాయిదా, డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితా



తెలంగాణలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదు గడువును ఎన్నికల సంఘం పొడిగించింది. ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియలో సాంకేతిక ఇబ్బందులు తలెత్తడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీనివల్ల అర్హులైన పట్టభద్రులు నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ వరకు తమ ఓటును నమోదు చేసుకునే అవకాశం లభించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) సి. సుదర్శన్ రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. వరంగల్-ఖమ్మం-నల్గొండ, మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ పట్టభద్రుల నియోజకవర్గాలకు ఈ గడువు పొడిగింపు వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు. గత కొన్ని రోజులుగా సర్వర్ సమస్యల కారణంగా ఆన్‌లైన్ పోర్టల్ మొరాయించడంతో, పలు రాజకీయ పార్టీలు, పట్టభద్రుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. వాస్తవానికి దరఖాస్తులకు నవంబర్ 6 ఆఖరి తేదీ అయినప్పటికీ, తాజా పరిస్థితుల దృష్ట్యా ఆ గడువును పొడిగించారు. అయితే, ఓటర్ల జాబితా సవరణ షెడ్యూల్‌లో ఎలాంటి మార్పు లేదని అధికారులు స్పష్టం చేశారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం నవంబర్ 25న ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేయనున్నారు. దీనిపై నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 వరకు అభ్యంతరాలు, ఫిర్యాదులను స్వీకరిస్తారు. అనంతరం, డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. ఈ గడువు పొడిగింపుతో అభ్యంతరాల స్వీకరణ సమయంలోనే కాకుండా, తుది జాబితా వెలువడిన తర్వాత కూడా నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు వెసులుబాటు కలిగింది.

ఏపీ విద్యుత్ నియంత్రణ మండలికి కొత్త సారథి

ఏపీఈఆర్సీ నూతన చైర్మన్‌గా బినోయ్ కుమార్

విశ్రాంత ఐఏఎస్ అధికారికి కీలక బాధ్యతలు

ఐదేళ్లు లేదా 70 ఏళ్ల వయస్సు వరకు పదవీకాలం

ఈ మేరకు రాష్ట్ర ఇంధన శాఖ ఉత్తర్వుల జారీ



ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) నూతన చైర్మన్‌గా విశ్రాంత ఐఏఎస్ అధికారి బినోయ్ కుమార్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ఇంధన శాఖ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన పదవీ బాధ్యతలు చేపట్టిన తేదీ నుంచి ఐదేళ్ల పాటు లేదా 70 ఏళ్ల వయస్సు నిండే వరకు (ఈ రెండింటిలో ఏది ముందైతే అది) ఆ పదవిలో కొనసాగుతారు. బినోయ్ కుమార్‌కు పరిపాలనా రంగంలో విశేష అనుభవం ఉంది. ఆయన మూడు దశాబ్దాలకు పైగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సర్వీసుల్లో పలు కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ముఖ్యంగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2012-13 మధ్య కాలంలో ముఖ్యమంత్రికి ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. విద్యుత్ రంగంలో సంస్కరణలు తీసుకురావడం, నిర్వహణ సామర్థ్యాన్ని పెంపొందించడం వంటి అంశాలపై ఆయనకు లోతైన అవగాహన ఉంది.

ఏబీ వెంకటేశ్వరరావుకు ఎన్నికల్లో తీవ్ర నిరాశ.. డిపాజిట్ గల్లంతు



విశ్రాంత ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావుకు మున్సిపల్ ఎన్నికల్లో తీవ్ర నిరాశ ఎదురైంది. ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టిన ఆయన... తాను ఎదుర్కొన్న తొలి ఎన్నికల్లోనే చేదు అనుభవాన్ని మూటగట్టుకున్నారు. విజయవాడ మేయర్ ఎన్నికల్లో ఘోర పరాభవాన్ని చవిచూశారు. ప్రధాన పార్టీలకు దీటుగా విస్తృతంగా ప్రచారాన్ని నిర్వహించినప్పటికీ, ఆయన కనీసం డిపాజిట్ కూడా దక్కించుకోలేకపోయారు. సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్ పార్టీల మద్దతుతో బరిలోకి దిగిన ఆయన, ఓట్ల సాధనలో మాత్రం పూర్తిగా వెనకబడ్డారు. నగరంలోని మూడు నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటించి ప్రచారం చేపట్టిన ఏబీ వెంకటేశ్వరరావు గౌరవప్రదమైన ఓట్లు సాధించడంలో పూర్తిగా విఫలమయ్యారు. అర్ధరాత్రి 1.30 గంటలకు వెలువడిన ఫలితాల్లో ఆయనకు కేవలం 11,137 ఓట్లు మాత్రమే సాధించారు. ఈ ఫలితాలు వామపక్షాల ఓటు బ్యాంకు కూడా ఆయనకు బదిలీ కాలేదనే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. కూటమిగా ఏర్పడి మద్దతు ప్రకటించినా, ఆ ఓట్లు ఏబీవీకి పడకపోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రచారంలో చూపిన జోరు, ఫలితాల్లో కనిపించకపోవడంతో ఆయన వర్గీయులు నిరాశ చెందారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com